# సుమబాల

## అంతర్జాల పిల్లల మాసపత్రిక

01-09-2026 సంపుటి -1 సెప్టెంబర్ సంచిక-9 రూ50/-



సుమబాల

# సుమబాల

అంతర్జాల పిల్లల మాసపత్రిక





## సుమబాల పరివారం

సంపుటి :1 మే 2026 సంచిక:5

సంపాదకురాలు :అవుతు శ్రీవిద్య

సహ సంపాదకులు :ఈ శ్రీనివాస రెడ్డి

ముఖచిత్రం & ఏ ఐ చిత్రాలు :మోక్షదేవ్

గ్రాఫిక్స్:జ్ఞానిక

**చందా వివరాలు:**

సంవత్సర చందా రూ 500 (ఆన్లైన్ )
సంవత్సర చందా రూ 1000 (ప్రింట్)

ప్రకటనలు , చందాలకు మరియు రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా
sumathibalapatrika@gmail.com

ప్రచురణ

**సుమతి పబ్లికేషన్స్**

(RC NO.:538/2006 )

హౌస్ నం :26 -46 -79,వేణుగోపాల నగర్,
గుంటూరు ,ఆంధ్రప్రదేశ్



# మా విన్నపం ...





**సుమబాల.. బాలల చేతిలో సుమమాల**

చక్కని కథలతో.. ధారావాహికలతో.. అందమైన రంగురంగుల బొమ్మలతో జనవరి – 2026 సంచిక మీ ముందుకు వచ్చేసింది.

అచ్చులో కూడా అందుబాటులో వుంది మీ అభిమాన సుమబాల పత్రిక.


అప్పటి చందమామను గుర్తుకు తెచ్చేలా ఉత్తమ సంస్కారాలతో, అలనాటి చందమామకు రచనలు చేసిన అతిరథ మహారథుల సహకారంతో సుమబాల సృష్టి జరిగింది.

మీ అందరి ప్రోత్సాహ సహకారాలతో ఈనాటి బాలలకు కూడా, ఆనాటి చందమామను పోలిన సుమబాల పరిచయం చెయ్యడం సాధ్య పడుతుంది. ఈ బాలలు కూడా తమ బాల్యంలోని మధురిమలను మరువలేని జ్ఞాపకాలుగా మనలాగే మార్చుకోనివ్వండి.

ఈ సందర్భంగా గాలిబ్ పలుకులు స్ఫురణకు వస్తున్నాయి –

దేవుడితో అంటాడు – ఉందో లేదో తెలియదు నీ స్వర్గం తిరిగిచ్చేయ్ నా బాల్యం. తిరిగిచ్చేద్దాము వారికి ఆ అందమైన బాల్యాన్ని సుమబాల వారి చేతికి అందించి.

మీ ప్రియమైన చిన్నారులకు ఈ సాహితీ చందమామను కానుకగా అందివ్వండి. వారి ముఖంలోని సంతోషపు వెలుగులను మీ గుండెల్లో నింపుకోండి.





# లోపలి పేజీలలో .....

## చిన్నకధలు:

1.మేము సైతం

2. ప్రాణం ఖరీదు

3.శొంటివైద్యం

4.వీరనారి ఝుల్కారి బాయి

5.హితవు

6.భయం

7.అన్నదమ్ముల కధ

## బాల గేయాలు:

1. మంచి అలవాట్లు

2.బుర్రు పిట్ట

## బొమ్మల కధలు:

అలీ బాబా 40 దొంగలు

రాము & రోబో

## సైన్సు కధలు:

రాజా రెడ్డి

## నీతి కధలు:

చిరంజీవులు

అక్బర్ బీర్బల్ కధలు

తెనాలి రామకృష్ణ కధలు

ముల్లా నసీరుద్దీన్ కధలు

నీతి చంద్రిక కధలు

భేతాళ కధలు

## ధారావాహికలు :

మహాభారతం

అశ్వధ్ధామ

పృధ్వీరాజ్ చౌహాన్

## పోటీలు:

1.బొమ్మకు కధ

2.బొమ్మలు వేసి పంపండి

3. పజిల్



## ఇంకా ...

1.రోబో సంగతులు ,2.విహారి ,3.మెదడుకు మేత 4.వేమన పద్యాలు 5. సుమతీ శతకం 6.బొమ్మలు చేద్దాం 7. రంగులు వేద్దాం 8. కనుక్కోండి చూద్దాం 9. తేడాలు కనిపెట్టండి 10.చూడాల్సిన సినిమా 11.వండర్ కిడ్స్ 12. డబ్బు విలువ నేర్పుదాం





# సుమబాల

పిల్లలు విఘ్నేశ్వరుడి పూజకోసం చేసే ప్రతి పనీ ఒక్కో నైపుణ్యమే. కళల్ని పరిచయం చేస్తుంది. శాస్త్రీయ అంశాల్ని అధ్యయనం చేయిస్తుంది. సామాజిక సంబంధాల్ని మెరుగుపరుస్తుంది వినాయకుడి పూజలో పత్రి ప్రాధాన్యం తెలిసు కదా . మాచీపత్రం, బదరీపత్రం ఇలా ఒక్కోరకం పత్రి కోసం ఒక్కోచోటికి పిల్లలే వెళ్లేవారు. పెరట్లో, పక్కింట్లో, గుడిలో, బడిలో, పొలాల్లో ఆ మొక్కల కోసం వెతికేవారు. అవి తెచ్చే క్రమంలో ఆ చెట్టు ఆకులు, కాయలు, ఫలాలు, బెరడు వంటి వాటిల్లోని ఔషధ విలువలన్నీ పరిచయమయ్యేవి. మొక్కల రకాలు తెలిసేవి. ఒకరకంగా ఇదంతా వృక్ష శాస్త్ర అధ్యయనమే. ఈ సేకరణలో కొన్ని ఎత్తుగా ఉన్న చెట్లు ఎక్కాలి. మరికొన్ని చెట్లు ముళ్లతో ఉంటాయి. అలాంటివి కోయడంలో శ్రమ, ఓపిక, నేర్పు కావాలి. ఇవన్నీ ఏ కౌన్సెలింగ్ లేకుండానే వచ్చేవి. వీటితో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాలూ తెలిసేవి. పాములు, కీటకాల బారిన పడకుండా ఎలా జాగ్రత్తపడాలో నేర్చుకునేవారు. అందుకే ప్రతి సేకరణ అనేక నైపుణ్యాలతో కూడిన అభ్యాసం.కాబట్టి మీరు కుడా జాగ్రత్తగా పత్రి  సేకరించండి , అన్నట్టు మట్టి విగ్రహాలనే పూజ కు వాడండి .



# తమాషాలెక్కలు

## గణిత వినోదం –6

### పిల్లలూ! . మరో గణిత వినోదంతో మీ ముందుకువచ్చేసాను.

పిల్లలూ! మరో చక్కని గణిత వినోదం తో మీ ముందుకు వచ్చేసా! మీ స్నేహితులతో ఏదైనా ఒక మూడంకెలసంఖ్య ఒక కాగితం పై వ్రాయమనండి.కానీ నియమం ఏమిటంటే ఆ సంఖ్యలోని మూడు అంకెలు ఒకే అంకెలై ఉండాలి. ఇపుడు ఆ సంఖ్యలోని మూడు అంకెలను కలుపగా వచ్చిన సంఖ్యచే ఆ మూడు అంకెల సంఖ్యను భాగించమనండి.ఇక్కడి నుంచి మీ ఇష్టం . ఉదాహరణకు , వచ్చిన భాగఫలం లోంచి 17 తీసివేసి 5 చే గుణించమనండి. ఫలితం ఎంతో మీరు సులభంగా చెప్పేయవచ్చు.ఎలాగో చూద్దామా!

కిటుకు: ఆ మూడంకెల సంఖ్య ఏది తీసుకుని ఆ సంఖ్యలోని మూడుఅంకెలను కలిపి ఆ మూడు అంకెల సంఖ్యను భాగిస్తే ఎప్పుడూ మీకు 37 మాత్రమే వస్తుంది.అది మనసులో ఉంచుకుని ఆ తర్వాత మీరు ఏమి చేయమంటే ఆ 37 తో మీరు మనసులో చేసుకుంటూ చివరగా జవాబు చెప్పడమే.

ఉదాహరణ: పైన అడిగిన దానికే చూద్దాం .మీ స్నేహితుడు ఆ మూడంకెలసంఖ్యను 666 తీసుకున్నాడనుకుందాం. దానిని ఆ సంఖ్యలోని మూడంకెల మొత్తం కలపగా 18 , దానిచే 666 ని భాగించగా 37 భాగఫలం వస్తుంది. మీ స్నేహితుడు మీరు చెప్పిన విధంగా ఏ మూడంకెల సంఖ్య తీసుకున్నా 37 మాత్రమే భాగఫలం వస్తుంది.ఇపుడు పైన చెప్పినట్లు దానిలోంచి 17 తీసివేసి 5 చే మనసులో గుణించుకుని 100 అని సులభంగా చెప్పవచ్చు. ఒకేసారి ఐదారుగురు స్నేహితులతో ఆడాలనుకున్నప్పుడు అసలు కిటుకు బయటపడకుండాలంటే వాళ్ళను వాళ్ళకి నచ్చిన మూడంకెల సంఖ్యను తీసుకుని ఆ మూడంకెల సంఖ్యను ఆ మూడంకెలసంఖ్యలోని అంకెల మొత్తం చే భాగించడం వరకూ అడిగి అక్కడినుంచి మీకు నచ్చిన రీతిలో ఒక్కొక్కరిని ఒకో విధంగా అడిగి వాటికి అనుగుణంగా మనసులోనే గణించుకుని సమాధానాలు చెపుతుంటే ఆశ్చర్య పోవడం వాళ్ళ వంతు అవుతుంది.ఇంకెందుకు ఆలస్యం ,మీరూ ప్రయత్నించండి.

**-కొమ్ముల వెంకట సూర్యనారాయణ**





# మేము సైతం!

పచ్చనూరు గ్రామం అంచున ఉన్న నీలగిరి అడవి... అది కేవలం చెట్ల సమూహం కాదు...ఆ ఊరి శ్వాస, ఆ ఊరి చరిత్ర, ఆ ఊరి భవిష్యత్తు. ఉదయం పూట మబ్బుల మధ్యన నుంచి తేలికగా చొచ్చుకొచ్చే సూర్యకిరణాలు, పక్షుల కిలకిలలు, చిన్న వాగుల జలజలలు...ఇవి అన్నీ కలిసే ఆ గ్రామానికి జీవం పోస్తాయి..

కానీ ఒక రోజు  ఆ శాంతి తారుమారైంది.

ప్రభుత్వం అక్కడ ఒక భారీ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించాలని నిర్ణయించింది. ఆ ప్రాజెక్ట్ బాధ్యత ఆ జిల్లా కలెక్టర్ అయిన ప్రశాంత్‌కు అప్పగించింది.

ఆదేఊళ్ళో వ్యవసాయం చేస్తూ,ప్రకృతిని ప్రేమించే ప్రశాంత్ అన్నయ్య అయిన కృష్ణయ్యకు ఆ వ్యవహారం నచ్చలేదు. అతను ప్రకృతిని ప్రేమించే రైతు, అనుభవంతో జీవితం నేర్చుకున్నవాడు, "అభివృద్ధి అంటే సమతుల్యత" అని నమ్మే మనిషి.ప్రశాంత్ తో విభేదించాడు.

ఒక సాయంత్రం... వేపచెట్టు కింద కృష్ణయ్య కూర్చుని ఉన్నాడు. ప్రశాంత్ అతని ముందుకు వచ్చాడు.

"అన్నా, ఈ ప్రాజెక్ట్ వల్ల ఉద్యోగాలు వస్తాయి, ట్రేడ్ పెరుగుతుంది, మన ఊరు మ్యాప్ మీదకి వస్తుంది," అన్నాడు ప్రశాంత్.

కృష్ణయ్య నిశ్శబ్దంగా నవ్వాడు.

ఆపై, "మ్యాప్ మీదకి వస్తే సరిపోతుందా? గాలి మ్యాప్‌లో కనిపిస్తుందా ప్రశాంత్? నీళ్లు కనిపిస్తాయా? నీడ కనిపిస్తుందా?"

"నీది  భావోద్వేగం అన్నా! దేశం ముందుకు వెళ్లాలి!"

"దేశం ముందుకు వెళ్తే ప్రకృతి వెనక్కి పోతే...అది ముందుకెళ్లడమా? లేక పతనమా?"

"మరి అడవిని అలాగే వదిలేస్తే పేదరికం పోతుందా?"

"పేదరికం పోవడానికి అడవిని నరుక్కోవాలా? లేక అడవిని కాపాడుతూ జీవన మార్గాలు వెతకాలా?"



# కథ

ఆ మాటలు ప్రశాంత్ కు గట్టిగా తగిలాయి. ఇద్దరి మధ్య సంవాదం  పెరిగింది.

చివరికి “నీ ఆలోచనలు పాతవి అన్నా,” అని ప్రశాంత్ చెప్పి వెళ్లిపోయాడు.

“నీ ఆలోచనలు ప్రమాదకరం తమ్ముడూ! అభివృద్ధి అంటే కాంక్రీట్ రోడ్లు కాదు. రేపు పొద్దున గాలి కోసం సిలిండర్లు మోసే పరిస్థితి వస్తే, అప్పుడు నీ రోడ్ల మీద కార్లు కాదు, శవాల యాత్రలు జరుగుతాయి. ఈ అడవిని నరకనివ్వను!”” అని కృష్ణయ్య గట్టిగా మనసులో అనుకున్నాడు.

ఒకే ఇంట్లో అన్నదమ్ములు శత్రువులయ్యారు. కృష్ణయ్యకు  కూతురు మైత్రేయి అదే ఊరిలో ఉపాధ్యాయిని గా పని చేస్తుంది.ఆమెసంఘ సేవికకూడా. ఆమె తన తండ్రి ఆవేదనను, బాబాయ్ పట్టుదలను చూసి తల్లడిల్లిపోయింది. రోడ్డు సర్వే మొదలైంది.

కృష్ణయ్యకు  గ్రామస్తులను పోగుచేసి అడ్డుకున్నాడు. ప్రశాంత్ నిస్సహాయుడై, ప్రభుత్వ ఆదేశాల మేరకు తన సొంత అన్నను “శాంతిభద్రతల విఘాతం” కింద అరెస్ట్ చేయించి జైలుకు పంపాడు.

జైలులో తండ్రిని చూడటానికి వెళ్లిన మైత్రేయితో కృష్ణయ్య  ఒక భయంకరమైన సత్యాన్ని చెప్పాడు. “తల్లీ, వాళ్లు రోడ్డు వేయాలనుకుంటున్నది జనం కోసం కాదు. అడవి లోపల ఉన్న అరుదైన ఖనిజ నిక్షేపాలను, ఎర్రచందనం చెట్లను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ఈ రోడ్డు ఒక సాకు మాత్రమే. దీని వెనుక పెద్ద రాజకీయ కుట్ర ఉంది. బాబాయ్‌ని వాళ్లు పావులా వాడుకుంటున్నారు.” మైత్రేయి కళ్లలో నిప్పులు చెరిగాయి.

తన బాబాయ్‌ని కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని ఆమెకు అర్థమైంది. ఆమె అడవికి ఆనుకొని ఉన్న గూడెము పెద్ద అయిన సిద్ధయ్య వద్దకు వెళ్లింది.అతని సహాయంతోఅడవిలోకి వెళ్లి ఆధారాలు సేకరించింది. అలాగే అతనికి ఒక ఆలోచన చెప్పింది. ఒక రోజు సిద్దయ్య తన వాళ్ళతో కలిసి  కార్మికుల్లా మారి స్మగ్లర్ల క్యాంప్‌లోకి వెళ్లారు.అక్కడవారు  గుర్తు పట్టని విధంగా స్మగ్లర్ లతో  కలిసి పోయారు.

ఒక రోజు , “ముందు అడవికి నిప్పు పెట్టాలి... గందరగోళంలో కలెక్టర్‌ని కూడా తొలగించాలి,” అని స్మగ్లర్  నాయకుడు అన్న మాటలను సిద్ధయ్య తన ఫోన్ లో రికార్డ్ చేశాడు.

మరొక వైపు  మైత్రేయి తాను చదువు చెప్పే పాఠశాల పిల్లలందరినీ రహస్యంగా సమావేశపరిచింది. “పెద్దలు ఆయుధాలతో పోరాడుతున్నారు, మనం అక్షరాలతో పోరాడుదాం, మనం  ప్రతి చెట్టుకు వివరాలు రాసి సజీవ సమాచారం సృష్టిద్దాం .” అని పిలుపునిచ్చింది.

పిల్లలందరూ కలిసి అడవిలోని ప్రతి చెట్టుకు ఒక పరిచయ పట్టిక తయారు చేశారు. ఆ చెట్టు వయస్సు, అది ఇచ్చే ఆక్సిజన్ విలువ, దాని ఔషధ గుణం,దానిపై నివసించే పక్షుల సంఖ్యను రాసి చెట్లకు కట్టారు. అడవిని ఒక “ఓపెన్ ఎయిర్ స్కూల్”గా మార్చేశారు.

రెండోరోజుల తరువాత  ప్రశాంత్ భారీ జెసిబి యంత్రాలతో అడవికి వచ్చాడు. కానీ అక్కడ దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు.అడవిని ఆవరించి ఉన్న గ్రామాలలోని లోని యువకులు, వందలాది మంది పాఠశాల విద్యార్థులు ప్రతి చెట్టును హత్తుకుని నిలబడ్డారు. ఇతరులు అక్కడ ఒక పెద్ద మానవ హారంగా నిలుచున్నారు.

“బాబాయ్.. ఈ చెట్టు పేరు ‘తాతయ్య’. ఇది 200 ఏళ్లుగా మాకు నీడ ఇస్తోంది. దీన్ని కూల్చాలంటే ముందు మా పుస్తకాలను కాల్చేయ్, మమ్మల్ని తొక్కేయ్!” అని మైత్రేయి అరిచింది.గ్రామస్తులు,పిల్లలు ఆమెకు వంత పాడారు.

ప్రశాంత్ మనసు కరిగింది. కానీ వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.అయినా ధైర్యం చేసి కాంట్రాక్టర్లతో పని ఆపాల్సిందేనని గట్టిగా చెప్పాడు.

పిల్లల నిరసనతో పని ఆగిపోవడంతో, స్మగ్లింగ్ ముఠా నాయకులు రంగంలోకి దిగారు. రాత్రికి రాత్రే అడవికి, నిప్పు పెట్టి,ఆ గొడవలో, ప్రశాంత్‌ను అంతం చేయాలని ప్లాన్ చేశారు.

అడవిలో మంటలు చెలరేగాయి.

ప్రశాంత్ మంటల్లో చిక్కుకున్న పిల్లలను కాపాడటానికి ఉరికాడు. ఒక పెద్ద చెట్టు కూలి ప్రశాంత్ మీద పడబోతుంటే, అపుడే బెయిల్ మీద వచ్చిన  కృష్ణయ్య తన తమ్ముడిని



# కథ

పక్కకు నెట్టి తను గాయపడ్డాడు.

"అన్నా.. నన్ను క్షమించు! నేను చదువుకున్నాను.కానీ చదువు నాకు కళ్ళు ఇవ్వలేదు, నీ ప్రేమే నాకు మార్గం చూపింది," అని ప్రశాంత్ వేదన పడ్డాడు.

సిద్దయ్య తన గిరిజన తెగ వారితో కలిసి వచ్చి ప్రాణాలకు తెగించి మంటలను ఆర్పారు. మైత్రేయి విద్యార్థుల బృందం కూడా తమ వంతు సాయంచేసింది.

అటు తరువాత మైత్రేయి, సిద్దయ్య పంపిన....స్మగ్లర్ల కుట్రకు సంబంధించిన వీడియోలను, వారు మాట్లాడిన మాటలను సోషల్ మీడియాలో లైవ్ పెట్టింది.

ఆ వీడియో,ఆడియో లు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. విషయం కోర్టుకు వెళ్లింది.

సంవత్సరం తర్వాత హైవేను అడవికి 20 కిలోమీటర్ల దూరం నుండి మళ్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. స్మగ్లింగ్ కుట్రలో ఉన్న రాజకీయ నాయకులు జైలు పాలయ్యారు.

ప్రశాంత్ తన కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, అదే గ్రామంలో "ప్రకృతి పాఠశాల" ప్రారంభించాడు. కృష్ణయ్య గాయాల నుండి కోలుకుని, పిల్లలకు పర్యావరణ పాఠాలు చెబుతున్నాడు.


మైత్రేయి,సిద్దయ్యలు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆ అడవికి ఆనుకొని ఉన్న పట్టణాలలోకి వెళ్ళి సీడ్ బాల్ (విత్తన బంతులు) కార్య శాల నిర్వహించారు. ఆదేసందర్భంగా కృష్ణయ్య తన గ్రామం లో వెయ్యి మొక్కలను పిల్లలచే నాటించాడు. పిల్లలు మొక్కలను నాటుతుంటే ... కృష్ణయ్య మరియు ప్రశాంత్ ఇద్దరూ కలిసి దానికి నీళ్లు పోశారు.

పిల్లలు తాము నాటిన మొక్కలను ఆనందంగా చూస్తుండగా ...

"పిల్లలూ !మీరూ, మీ పంతులమ్మా !పెద్దలు పరిష్కరించలేని సమస్యను "మేము సైతం" అంటూ .... మీ ఐక్యతతో, తెలివితేటలతో పరిష్కరించారు. ఈ అడవి మీది, ఈ భవిష్యత్తు మీది.మహాకవి శ్రీశ్రీ అన్నట్లు.. "కదిలేది, కదిలించేది.. పెనుతుపానులా మార్చేదే కవిత్వం కాదు ... కదిలేది, కదిలించేది.. పెనుతుపానులా మార్చేది పోరాటంకూడా ." ఈఅడవి ఇప్పుడు కేవలం చెట్ల సమూహం కాదు, మీ త్యాగానికి,ధైర్యానికి చిహ్నం. " అన్నాడు కృష్ణయ్య గర్వంగా.

**కుంతి(కె.కౌండిన్యతిలక్)**

## కథ



# ప్రాణం ఖరీదు

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక మడుగు. ఆ మడుగులో ఒక మొసలి అనేక జల చరాలుతో నివాసం ఉండేది. ఆ మడుగు పక్కన పెద్ద మఱ్రి చెట్టు. ఆ మఱ్రి చెట్టు పై ఎన్నో జీవులు నివాసం ఉండేవి. మడుగులోని మొసలి చాలా టక్కరి. తన మాయ మాటలతో ఎన్నో జీవులను తన కడుపు మంటకు బలి తీసుకుంది.మొసలి మొదట స్నేహం చేస్తూన్నట్టు నటించి అవతల జీవిని నమ్మిస్తుంది. ఒక సారి అవతల జీవి పూర్తిగా మొసలిని నమ్మితే అంతే దాని అంతు చూసేది.

అలాగా ఒక సారి మడుగు కు నీరు తాగడం కోసం వచ్చిన నక్క మామతో మొసలి మాటలు కలిపింది. నక్క మడుగుకు రావడం తన అదృష్టమని నమ్మ బలికింది. నక్కతో స్నేహం కోసం ఎన్నో ఏళ్ళ నుండి ఎదురు చూస్తున్నట్టు చెప్పింది. రోజు మడుగు దగ్గరకు వస్తే రెండు చేపలు ఇస్తానని చెప్పింది. రోజు నక్కకు ఆహారం వేదికే బేజాడి లేకుండా చేస్తానంది. రోజుకు రెండు చేపల రూపంలో నక్కకు ఆహారం లభించడం..... పరాన్నజీవి ఐన నక్క కు నచ్చింది.రోజు నక్క మడుగు దగ్గరకు రావడం. మొసలి ఇచ్చిన రెండు చేపలు తినటం షరా మాములు ఐపోయింది. ఆ రెండింటికి స్నేహం కుదిరింది. మొసలి తో స్నేహం మంచిది కాదని మిగిలిన జీవులు చెప్పిన నక్క వినిపించుకోలేదు.

ఒక రోజు మడుగు దగ్గరకు వచ్చిన నక్కతో మొసలి "నేస్తమా, ఈ రోజు నువ్వు మా మడుగు చూడాలి. నువ్వు నా వీపు పై కూర్చో. మడుగు మొత్తం తిప్పి చూపిస్తాను "అంది. అలాగే అని నక్క మొసలి వీపు పై కూర్చుంది. మొసలి నక్కను మడుగు మధ్య లోకి తీసుకెళ్లి పీక లోతున్న చోట నక్కను దించింది. అప్పుడు నక్కకు భయం వేసింది. ఈ మొసలి తన్ను చంపడానికి ఈ ఎత్తు వేసిందని చాలా ఆలస్యంగా తెలుసు కుంది. ఏం చేయాలో తెలియ లేదు.మఱ్రి చెట్టు పై నుంచి గమనిస్తున్న కోతి "నక్క మామ ఇక్కడున్నావా? నీకోసం నేను అడవి అంతా వెతుకుతున్నాను.రోజూ ఇంటిలో పూజా చేసి బయటకు వస్తావట. ఈ రోజు రోజు లా పూజ చేయకుండా బయటకు వచ్చావట. రా పూజ చేసి వద్దువు "అంటూ మఱ్రి ఊడ మడుగు లోకి విసిరింది కోతి. బతుకు జీవుడా అంటూ ఆ మఱ్రి ఊడ పట్టుకుని చెట్టుపైకి చేరింది నక్క. నోటి దాకా వచ్చిన కూడు చేజారిందని మొసలి బాధ పడింది."ప్రాణం ఖరీదు రెండు చేపలు కాదు మిత్రమా. ప్రాణం ఎంతో విలువైంది. ప్రాణానికి ఖరీదు కట్టలేము. ఇక నైనా జాగ్రత్త గా మసులుకో "అంటూ కోతి నక్క మామకు ప్రాణం ఖరీదు విడమరచి చెప్పింది.

-రాళ్లబండి సంగం నాయుడు



# శొంఠి వైద్యం

. ఒక గ్రామంలో రామయ్య అనే వ్యాపారస్థుడు వున్నాడు. అతనికి పరమానందయ్యగారంటే ఎంతో భక్తి. పరమానందయ్యగారి తండ్రి, తాతల కాలం నుండి కుటుంబ గురువులు. అందువల్ల ఆయన పరమానందయ్యగారిని దైవసమానంగా భావిస్తున్నాడు. ఆయన మాట వేద వాక్యంగా భావించి పాటిస్తాడు. అప్పుడప్పుడూ ఆయన పరమానందయ్యగారి వద్దకు వచ్చి తృణమో పణమో యిచ్చి వెళుతూ వుంటాడు.

రామయ్య తన గ్రామంలో వడ్డీ వ్యాపారం చేసేవాడు. కిరాణా దుకాణం, బట్టల దుకాణం నడిపేవాడు. అనేక అబద్ధాలు ఆడి, మోసాలు చేసి విశేష ధనం, భూమి సంపాదించాడు. కానీ భార్యా పిల్లలు దక్కలేదు. నా అనే దిక్కులేక, గ్రామస్థులతో, సరిపడక మనసు బాగులేనప్పుడూ, ఏదయినా అనారోగ్యం వచ్చినప్పుడూ పరమానందయ్యగారి వద్దకు వెళ్ళి, రెండురోజులు ఉండి పోతుండేవాడు.

ఇలా జరుగుతూ ఉండగా ఒకసారి రామయ్యకు కడుపునొప్పి పట్టుకొంది. ఎన్నాళ్ళకూ తగ్గలేదు. మంచం పట్టాడు. తన స్థితి పరమానందయ్యగారికి ఉత్తరం ద్వారా తెలియచేసి ఒకసారి రమ్మని ప్రార్థించాడు. రామయ్య ఉత్తరం చదువుకొని పరమానందయ్యగారు శిష్య సమేతంగా మరునాడు అతని గ్రామం వెళ్ళారు. గురువుగారిని చూచి రామయ్య చాలా మర్యాద చేసి తన బాధను గురించి వివరంగా చెప్పాడు. పరమానందయ్యగారు 'నేను వచ్చానుగదా భయపడకు! ఇదొక గొప్ప రోగమా? దీనికి నా శిష్యులు చికిత్స చేయగలరు. రెండు రోజులలో నీ సమస్త బాధలూ తీరిపోతాయి. నిర్భయంగా వుండు'. అని ధైర్యం చెప్పాడు. శిష్యులను పిలిచి ఆయనకు చేయవలసిన చికిత్స గురించి వివరంగా చెప్పారు.

గురువుగారి ఆజ్ఞ దొరకడం తడవుగా ఒక శిష్యుడు తన సంచిలో వున్న శొంఠి పొడుము తీసి కాస్త పంచదార కలిపి రామయ్యకు ఇచ్చి గోరువెచ్చని నీళ్ళు త్రాగించాడు. ఆ విధంగా మూడు పూటలు యిచ్చేసరికి రామయ్యగారికి



# కథ

కడుపునొప్పి తగ్గి ఆకలి పుట్టింది. రామయ్య చాలా సంతోషించాడు. రెండవ రోజున మరొక శిష్యుడు శొంఠి మెత్తగా దంచి కషాయం కాచి త్రాగించాడు. రామయ్య శరీరమంతా వేడి పుట్టింది. మూడవరోజున మరొక శిష్యుడు శొంఠి గంధం తీసి రామయ్య శరీరమంతా పట్టించాడు. దాంతో రామయ్య శరీరమంతటా మంటలు పుట్టాయి. ఆ బాధ భరించలేక రామయ్య గట్టిగా ఏడవనారంభించాడు. అది చూసి పరమానందయ్యగారు 'భయపడకు! రోగం తగ్గేముందు అలాగే వుంటుందని ' ధైర్యం చెప్పాడు. రామయ్య నిజమే కావచ్చుననుకొని మంటను ఓర్చుకొంటున్నాడు. నాలుగవరోజున మరొక శిష్యుడు శొంఠి నూరి ముద్దచేసి రామయ్య నడినెత్తిమీద వేసి కట్టుకట్టాడు. ఉన్న బాధలు చాలక తలపోటు పట్టుకొని పిచ్చిగా అరుస్తూ బాధపడసాగాడు.

అతని స్థితి చూసి పరమానందయ్యగారు శిష్యులను పిలిచి కొంపముంచారు. రామయ్య చచ్చేస్థితిలో వున్నాడు అని బాగా ఆలోచించి చికిత్స సాగించాడు. గురువు గారి మాటలు విని శిష్యులు చాలా బాధపడ్డారు. ఇంత కష్టపడి చికిత్స చేస్తుంటే గురువుగారు మెచ్చుకోవడంలేదని ఆగ్రహించి 'గురువుగారూ! మీరేం దిగులుపడకండి. రామయ్య చచ్చినా అతని ప్రాణాలు మాత్రం పోనియ్యం' అని వాగ్దానం చేశారు. రాత్రి శిష్యులంతా కలసి ఆలోచించసాగారు. మనం ఎన్నిరకాల చికిత్సలు చేసినా రోగం తగ్గలేదు. రోగం తగ్గినా తగ్గకపోయినా ప్రాణం పోకుండా చూడాలి అని నిశ్చయించుకొన్నారు. ఒకనాడు ప్రాణం ఎటువేపునుంచి పోతుందో తెలుసుకోవాలన్నాడు. మరొకనాడు తెలుసుకోవడానికేముంది? కడుపులోనుంచి పోతుంది అన్నాడు. ఇంకొకడు ముక్కులో నుంచి పోతుందన్నాడు. వేరొకడు కళ్ళలోనుంచి పోతుందన్నాడు. ఈ విధంగా తలోక విధంగా చెప్పి ఎటూ నిర్ధారణ చేసుకోలేక పోయారు. వారిలో ఒక బుద్ధిమంతుడు యిలా చెప్పాడు. మన శరీరంలో నవరంధ్రాలున్నాయంటారు. ఆ రంధ్రాలను వెతికి మూసివేస్తే ప్రాణం ఎటూపోలేక చచ్చినట్టు పడివుంటుంది. అన్నాడు. అతని బుద్ధి కుశలతకు అంతా మెచ్చుకొన్నారు.

తమ వద్దనున్న శొంఠినంతా తీసి మెత్తగా దంచి ముద్ద చేసి రామయ్యను బలవంతంగా కదలకుండా పట్టుకున్నారు. అతని నవరంధ్రాలలో శొంఠి ముద్దకూర్చారు. ఎప్పుడైతే నోరు, ముక్కు రంధ్రాలు మూసివేశారో అప్పుడే అతని పంచప్రాణాలు గాలిలో కలసిపోయాయి. కదలక మెదలక పడి వున్నాడు. అతడు బాధ తగ్గి హాయిగా నిద్రపోతున్నాడని శిష్యులనుకొన్నారు. మంచం చుట్టూ కూర్చొని కునుకుతున్నారు. తెల్లవారింది గురువుగారు నిద్ర నుంచి మేల్కొని రామయ్య వున్న గదిలోనికి వచ్చారు. మంచం వద్దకు వెళ్ళి రామయ్య చెయ్యిపట్టుకొని నాడి చూశారు. గుండె మీద చెయ్యి పెట్టి చూశాడు. కొంప మునిగింది! రామయ్య చనిపోయాడు. లేవండిరా! వెధవల్లారా. అని బిగ్గరగా అరిచారు. శిష్యులు గురువు గారి కేకలు విని త్రుళ్ళిపడి లేచారు. తాము చేసిన ఘనకార్యం గురించి చెప్పబోయారు, మీ తెలివి తక్కువ వైద్యము వల్ల రామయ్య చనిపోయాడు. ఎవరైనా ఈ సంగతి తెలుసుకొంటే చావగొట్టి చెవులు మూస్తారు. ఇతనికి దహన సంస్కారాలు చేయించాలి. కావలసిన వాళ్ళెవరూ లేరు. ఇరుగు పొరుగు వారికి ఈ సంగతి చెప్పి తీసుకొనిరండి అని పంపారు.

రామయ్య అంటే ఆ ఊళ్ళో వున్న వారికందరికీ చాలా కోపంగా వుంది. వాడు చస్తే మాకేం? బ్రతికితే మాకేం? మేము మాత్రం రాము. అని కబురు చేశారు. అంతట పరమానందయ్యగారు అతని శిష్యుల సహాయంతో దహన సంస్కారాలు జరిపారు. రామయ్య అంతకుముందే తాను చనిపోయిన తరువాత తన ఆస్తి అంతా తమ గురువుగారైన పరమానందయ్యగారి మఠమునకు యిస్తానని వాగ్దానం చేసి వీలునామా వ్రాసిపెట్టాడు. దాని ప్రకారం రామయ్య ఆస్థిని గైకొని శిష్యసమేతంగా స్వగ్రామం బయలుదేరారు పరమానందయ్యగారు.

............................

.......


## బాల గేయం

### బాల గేయం

### మంచి అలవాట్లు

మంచి తనానికి మెట్లు
అభివృద్ధికి బాటలు
దేశానికీ మేలు
చదువ సంధ్యలకు పుట్టిల్లు
వ్యక్తిత్వ పెట్టని కోటలు
నవ సమాజ రహదార్లు
యువ సమాజ ప్రతీకలు
మణులు మాణిక్యాలు
కెంపులు ఇంపులు
మంచితనమే
మనిషితనం
మానవత్వం
మంచిని పెంచుదాం
చెడును తుంచుదాం
మంచి అలవాట్లు పెంచుకుందాం
మరణాన్ని దూరం చేసుకుందాం
మంచి సమాజం నిర్మిద్దాం
మంచి కొంచమైనా పెంచు
నేడు అదే అవసరమని భావించు
భుజం భుజం
నిజం నిజం తెలుపు
ప్రపంచపటం నుండి
చెడును తొలగించు
మంచి వారితో స్నేహం
జీవిత మాధుర్యానికి చిహ్నం
రండి ఓ బాల బాలికులారా
మంచిని పెంచుదాం
మమతను పంచుదాం
పిన్నలు పెద్దలకు
ఆదర్శమవుదాం

రాళ్లబండి సంగం నాయుడు



# చిరంజీవులు



## వీరనారి ఝల్కారి బాయి !

భోజ్లా అను గ్రామంలో సరోవర్ సింగ్, జమున దేవి అను దంపతులు నివసిస్తుండేవారు. వీరు దళిత కుటుంబానికి చెందిన వారగుటచే ఊరికి దూరంగా ఉంచారు ఆ ఊరి పెద్దలు. ప్రతిరోజు ఆ దంపతులు అడవిలోకి వెళ్లి కట్టెలు కొట్టుకొని వచ్చేవారు. ఆ కట్టెలను సమీపములో ఉన్న ఓ నగరానికి తీసుకెళ్లి అమ్మి, వచ్చిన పైకంతో ఇంటికి కావలసిన సరకులను కొనితెచ్చుకునేవారు.

ఇలా ఉండగా యధారీతి ఆ దంపతులు ఒకరోజు కట్టెలు కొట్టుటకు అడవికి వెళ్లారు. భర్త ఒక రావి చెట్టును గొడ్డలితో కొడుతుండగా "ఏవండీ! ఆగండి! అది అశ్వత్థ వృక్షం. విష్ణుమూర్తి ప్రతిరూపం. కొట్టకండి అంటూ భర్త చేతిని చెట్టును నరకకుండా అడ్డుపెట్టింది."ఓ అలాగా! నేను అంత లోతుగా ఆలోచించలేదు జమునా "అని అన్నాడు భర్త.

అంతలోనే అశ్వత్థ వృక్షం మాను బొరియనుండి ఒక చిన్న విగ్రహం బయటపడింది. ఆ విగ్రహం మనుష్య భాషలో" ఓ దంపతులారా "మీరు ఈనాడు నాకు శాప విమోచన కలిగించారు"అంటూ ఆ విగ్రహం విష్ణుమూర్తి రూపం ధరించింది.

ప్రత్యక్షమైన విష్ణుమూర్తిని తమ కనులారా చూసిన ఆ దంపతులను"ఆశీర్వదిస్తూ మీకు త్వరలోనే పుత్రిక నా వర ప్రభావం వల్ల జన్మిస్తుంది. ఆ పుత్రిక మీ కీర్తి ప్రతిష్టలను పెంచుతుంది. తథాస్తు" అంటూ అదృశ్యమైపోయారు.

ఆ దంపతులకు ఒక సంవత్సరం తర్వాత ఓ పుత్రిక జన్మించింది. ఆ అమ్మాయిని వారు అల్లారు ముద్దుగా పెంచసాగారు. ఒకరోజు తల్లికి సుస్తి చేయడం వల్ల తండ్రిని ఇంటి వద్ద వుంచి తానే స్వయంగా కట్టెలు కొట్టుటకు అడవికి వెళ్ళింది. కట్టెలు కొడుతుండగా ఆకస్మాత్తుగా ఒక చిరుత పులి ఆమెపై దాడి చేసింది. ఆ అమ్మాయి భయపడక చేతిలోని గొడ్డలితో ఆ చిరుతపులితో తలపడి దాన్ని చంపి, రక్తం అంటిన బట్టలతోనే ఇంట్లోకి రాగా తల్లిదండ్రులు చూసి భీతిల్లి ఆందోళనతో "నీ బట్టల పై ఏమిటా రక్తపు మరకలు బిడ్డా! ఏమయ్యింది?" అంటూ ఒకరిని మించి ఒకరు ప్రశ్నించారు. చిరుత పులికి తనకు జరిగిన పోరాటం గురించి పూస గుచ్చినట్లు తల్లిదండ్రులకు" ఆ అమ్మాయి చెప్పింది .

# చిరంజీవులు



అది విని "ఆ దేవదేవుడు వరంగా ఇచ్చిన బిడ్డ కనుక ఆ దేవదేవుడే నిన్ను కాపాడుకున్నాడు అమ్మా" అంటూ తృప్తి చెందారు ఆ తల్లిదండ్రులు.

ఓ రోజున ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఫిరంగులు పేల్చే అధికారిగా ఉన్న మారాన్ సింగ్ తల్లిదండ్రులు ఆ అమ్మాయి ఇంటికి వచ్చి "మీ అమ్మాయి ధైర్య సాహసాలను మా కుమారుడు వీక్షించి మీ అమ్మాయిని చేసుకుంటే పెళ్లి చేసుకోవాలని పట్టు పట్టాడు. కాన మీరు మీ అమ్మాయిని నా కుమారునికి ఇచ్చి వివాహం జరిపిస్తారన్న ఆశతో మేము ఇక్కడికి వచ్చాము". అని విన్నవించుకోగా, ఆ అమ్మాయి తల్లిదండ్రులు కూడా అబ్బాయి విరంగి దళంలో ఉన్నతాధికారిగా ఉన్నాడు. మన బిడ్డకు ఏ లోటు లేకుండా చూసుకుంటాడు. అమ్మాయి సుఖపడుతుంది అని తలంచి వివాహం చేయుటకు ఒప్పుకున్నారు. ఓ శుభ ముహూర్తంలో వివాహం జరిపించారు.

వివాహమయిన తర్వాత వివాహమైన అత్తారిల్లు అయిన ఝాన్సీ నగరానికి వచ్చింది.

ఝాన్సీ బాయి రూపురేఖలతో ఉన్న మారన్ సింగ్ భార్యను చూసి తనలాగే ఉన్న ఆ అమ్మాయిని తన చెలికత్తెగా నియమించుకుంది.

ఆ అమ్మాయికి గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం, మల్ల యుద్ధం, తుపాకి, మరియు హిరంగులను పేల్చడంలో ఆమె భర్త తోనే శిక్షణ ఇప్పించింది.

ఇలా ఉండగా ఏప్రిల్ 1958 నా బ్రిటిష్ జనరల్ హ్యూరోజ్ సైన్యం ఝాన్సీ కోటను ముట్టడించుటకు సన్నాహాలు చేస్తున్న వర్తమానాన్ని గూడచారుల ద్వారా సేకరించిన ఆ అమ్మాయి ఝాన్సీ కోట రక్షణార్థం ఓ ప్రత్యేక దళానికి తానే స్వయంగా శిక్షణ ఇస్తూ"

మీరంతా నగర మందలి ప్రతి ఇంటికి ఒక పురుషుడిని, ఒక స్త్రీని తప్పక ఈ దళంలో చేర్పించాలి. వారికి శిక్షణ కూడా ఇవ్వాలి. బ్రిటిష్ శత్రు సైన్యం రేపు మాపో మనపై దాడి చేయవచ్చు. కాన మనమంతా అప్రమత్తులమై ఉండి మన మాతృభూమిని కాపాడుకోవాలి. మన మహారాణి లక్ష్మీబాయిని, మనకోటను సంరక్షించుకోవాలి."

అంటూ వారిని ప్రబోధించింది.

ఆ అమ్మాయి ఊహించినట్టుగానే బ్రిటిష్ సైన్యం 1958 సంవత్సరంలో ఏప్రిల్ మాస మందు ఝాన్సీ కోటను ముట్టడించింది. రాణీ లక్ష్మీబాయి లక్ష్మీబాయి, కోట రక్షణార్థమై బ్రిటిసైన్యంతో పోరాడేందుకు ఆ అమ్మాయి మహారాణి వేషం ధరించి తానే స్వయంగా కోట వెలుపలకి వచ్చి బ్రిటిష్ సైన్యాన్ని తప్పుదోవ పట్టించింది. తాను రాణి లక్ష్మీబాయినేనని బ్రిటిష్ వారిని నమ్మిస్తూ వారికి బందిగా

చిక్కి కోట రక్షణ కోసం, మాతృభూమి రక్షణ కోసం, దేశం కోసం, రాణి లక్ష్మీ బాయి ప్రాణాల రక్షణ కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి తన పంచప్రాణాలను అర్పించిన అమ్మాయే మన వీరనారీమణి ఝల్కారిబాయి.

అట్టి వీరనారీమణియైన ఆ ఝల్కారి బాయ్ కి ఈ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మనమందరం నివాళులర్పించి తరిద్దాం.

వీరనారీమని ఝల్కారీ బాయికి జయహో జయహో జయహో !

-. గుర్రాల లక్ష్మారెడ్డి"

## అక్బర్-బీర్బల్ కథలు



# దురాశ ధనయ్య

. అనగా అనగా ఓ ఊళ్ళో ధనయ్య అనే నేతి వ్యాపారి ఉండేవాడు. అతడు వట్టి ఆశపోతు. మీదు మిక్కిలి పిసినారి కూడాను. లాభాల మీద ఆశకొద్దీ కల్తీ నెయ్యి అమ్మేవాడు.

ఓసారి "ఊరికామందు" ఇంట్లో పెళ్ళికి కూడా కల్తీనెయ్యి సరఫరా చేశాడు. ఆ నేతితో చేసిన మిఠాయిలు తిన్న చుట్టాలందరికీ వాంతులయ్యాయి.

దాంతో ఊరికామందు ధనయ్యని పిలిపించి పంచాయితీ పెట్టించాడు. నెయ్యి కల్తీదని ఋజువు కావటంతో ధనయ్యని దోషిగా నిర్ధారించాడు. దాంతో శిక్ష ఖరారయ్యింది. వెయ్యి వరహాల జరిమానా విధించారు.


పిసినారి ధనయ్య కట్టలేనన్నాడు. వంద కొరడా దెబ్బలు విధించారు. దెబ్బలు తినలేనన్నాడు. అయితే మణుగు నెయ్యి తాగమన్నారు. ఆశపోతు ధనయ్యకి ఈ శిక్ష లాభసాటిగా అన్పించింది.

సరేనన్నాడు. కానీ సగం నెయ్యి తాగేసరికీ గుడ్లు తేలేసాడు. దాంతో కొరడాదెబ్బలు తింటానన్నాడు. కానీ యాభై దెబ్బలు తినేసరికీ బేర్ మన్నాడు.

నోరు మూసుకుని వెయ్యి వరహాలు జరిమానా కట్టి ఏడ్చుకుంటూ ఇంటికి పోయాడు. పిసినారి ధనయ్యకి తగిన శాస్తి జరిగిందని ఊళ్ళో వాళ్ళంతా నవ్వుకున్నారు.

ధనయ్య మాత్రం తన పిసినారితనంతోనూ, ఆశపోతుతనంతోనూ వరసగా అన్ని శిక్షలూ అనుభవించి, అసలు అదే సరైన శిక్ష అన్పించుకున్నాడు.

.★★★




# జాతీయ వ్యవసాయ శాస్త్ర సంగ్రహాలయం

న్యూఢిల్లీలోని ఐసీఏఆర్ (ICAR) జాతీయ వ్యవసాయ శాస్త్ర కేంద్రం ప్రాంగణంలో నెలకొన్న జాతీయ వ్యవసాయ శాస్త్ర సంగ్రహాలయం (NASM), దేశంలోనే ఈ తరహాలో మొట్టమొదటిది. 23,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, ప్రత్యేకంగా రూపొందించిన రెండు అంతస్తుల భవనంలో విస్తరించి ఉన్న ఈ సంగ్రహాలయం, చరిత్రపూర్వ కాలం నుండి భారతదేశంలో వ్యవసాయ అభివృద్ధిని మరియు మన దేశంలో వ్యవసాయంలో ప్రస్తుత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని భవిష్యత్ దృష్టితో చిత్రీకరిస్తుంది.

చరిత్రపూర్వ కాలం నుండి వ్యవసాయం మరియు పశుపోషణ భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయి. నేటికీ, భారత జనాభాలో సుమారు 65% మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం భారత సమాజపు సాహిత్యాన్ని, మత విశ్వాసాలను మరియు సంస్కృతిని కూడా తీర్చిదిద్దింది. దేశంలోని అపారమైన వ్యవసాయ సంపద, వేలాది మంది వలసదారులను భారతదేశానికి వచ్చి స్థిరపడేలా ఆకర్షించింది.


ప్రాచీన సాహిత్యం మరియు పురావస్తు తవ్వకాలు, ప్రాచీన మరియు మధ్యయుగ భారతదేశంలోని వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన అసంఖ్యాకమైన ఆధారాలను మనకు అందించాయి. స్వాతంత్ర్యం తరువాత, వరుసగా వచ్చిన పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. ఫలితంగా, భారతదేశం హరిత విప్లవాన్ని మరియు ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించింది. ఈనాడు, మనం ఒక బిలియన్ ప్రజలకు ఆహారం అందించడమే కాకుండా, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేంత సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాము. అందువల్ల, వ్యవసాయ కథే భారతీయ సమాజపు కథ. ఈ కథ జాతీయ వ్యవసాయ విజ్ఞాన సంగ్రహాలయంలో ఒక ప్రజాదరణ పొందిన రూపంలో నమోదు చేయబడింది. ఈ సంగ్రహాలయంలో 150 ప్రదర్శన వస్తువులు ఉన్నాయి, వీటిని 10 ప్రధాన విభాగాలుగా విభజించి ప్రదర్శించారు. అవి: వ్యవసాయం యొక్క ఆరు మూలస్తంభాలు, చరిత్రపూర్వ యుగంలో వ్యవసాయం, సింధు లోయ నాగరికత, వేద మరియు వేదానంతర యుగం, సుల్తానేట్ మరియు మొఘల్ యుగం, బ్రిటిష్ వారి రాక, స్వతంత్ర భారతదేశంలో వ్యవసాయ శాస్త్రాల పురోగతి,

# విహారి

వ్యవసాయానికి సంబంధించిన ప్రపంచ సమస్యలు, ఆహార భద్రతతో కూడిన భవిష్యత్తు దిశగా, మరియు బాలల విభాగం.

★★★









# తిలకాష్ట మహిష బంధనం

విజయనగర సామ్రాజ్యంలో అనేక మంది గొప్ప పండితులు ఉన్నారు — కానీ తెనాలి రామకృష్ణ అందరికంటే భిన్నంగా ఉండేవాడు. అతని తెలివితేటలు కేవలం శాస్త్రాలలో మాత్రమే కాదు, జీవిత అనుభవాలలో కూడా మెరిసేవి. ఒక గర్విష్టి పండితుడు విజయనగరానికి వచ్చి అందరినీ ఓడించినప్పుడు, తెనాలి ఒక్క రాత్రిలో ఒక అద్భుతమైన వ్యూహాన్ని రూపొందించాడు. ఈ కథ మనకు చెప్తుంది — నిజమైన తెలివి అంటే గ్రంథాల కంఠతా పాఠం కాదు, సమస్యను సమయానికి పరిష్కరించే శక్తి! ఒక గర్విష్టి పండితుడు విజయనగరానికి వచ్చాడు. బజారంతా అతని గురించే మాట్లాడుకుంటోంది — వందల సభలు జయించాడని, ఎవరూ ఓడించలేదని! అతను నేరుగా రాజు కృష్ణదేవరాయల సభకు వెళ్ళాడు. సభలో మంత్రులు, పండితులు అందరూ కూర్చున్నారు.

"ఈ రాజ్యంలో నన్ను ఓడించగలవాడు ఎవరైనా ఉన్నారా?"

సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఒక్కొక్క పండితుడు లేచి ప్రయత్నించాడు — కానీ ప్రతిసారీ అతడు వెంటనే సమాధానం చెప్పేశాడు. ఒక్కొక్కరూ తలదించుకుని కూర్చున్నారు. సభ మొత్తం నిశ్శబ్దంగా మిగిలింది.

"మహారాజా! నాకు ఒక్క రోజు సమయం ఇవ్వండి — నేను ఇతన్ని ఓడిస్తాను!"

"సరే! రేపటి సభలో వాదన జరుగుతుంది!"

తెనాలి రామకృష్ణ తన ఇంట్లో దీపం వెలుగులో ఒక పెద్ద పెట్టెను తయారు చేస్తున్నాడు. ఏదో వస్తువులు సర్దుతున్నాడు — ఏమి చేస్తున్నాడో కనిపించడం లేదు. ఆ తర్వాత పెద్ద ఎర్రటి వస్త్రంతో దాన్ని జాగ్రత్తగా చుట్టాడు.


తెనాలి చేతిలో పెద్ద ఎర్రటి వస్త్రంతో కప్పిన ఒక గ్రంథం పట్టుకుని సభలోకి నడుచుకుంటూ వచ్చాడు. నవ్వుతూ, నిశ్చింతగా! అందరూ ఆశ్చర్యంగా చూశారు — ఇది ఏమిటి?

"అది ఏ గ్రంథం?"

"ఇది 'తిలకాష్ట మహిష బంధనం' అనే మహా గ్రంథం.

# తెనాలిరామకృష్ణ కథలు

దీనిలో ఉన్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగితే... నేనే ఓడిపోయినట్టే!"



పండితుడు ఒక్కసారిగా ఆగిపోయాడు. ఆ పేరు అతను ఎప్పుడూ వినలేదు! సభలో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

"ముందు ఈ గ్రంథం మొదటి అధ్యాయం అర్థం చెప్పండి."

పండితుడు ఒక్క నిమిషం ఆలోచించాడు. తర్వాత తల పైకెత్తి అడిగాడు:

"ఈ గ్రంథం గురించి మరింత అధ్యయనం చేయడానికి నాకు ఒక్క రోజు సమయం ఇవ్వండి."

పండితుడు లోపల్లోపల ఆలోచించాడు — ఈ గ్రంథం గురించి ఎక్కడా వినలేదు, ఎక్కడా చదవలేదు. ఒక రోజులో ఏం తెలుసుకుంటాను? ఈ తెనాలి ముందు వాదన సాధ్యమే కాదు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత పండితుడు నిటారుగా నిలబడ్డాడు. గంభీరంగా తల వంచాడు:

"ప్రభువులకు జయం. నా ఓటమిని అంగీకరిస్తున్నాను. నాకు సెలవు ఇప్పిస్తే వెళ్ళిపోతాను."

రాజు గౌరవంగా సెలవు ఇచ్చారు. పండితుడు నిష్క్రమించాడు.

"తెనాలి! నిజంగా ఆ గ్రంథం ఏమిటి?"

తెనాలి నవ్వుతూ ఆ ఎర్రటి వస్త్రం తీసేశాడు.

"తిలకాష్ట అంటే నువ్వుల కట్టెలు... మహిష బంధనం అంటే గేదె కట్టే తాడు మహారాజా!"

మంత్రులు నవ్వారు. సభ మొత్తం సంతోషంగా మార్మోగింది. తెనాలి నమ్రంగా నవ్వుతూ నిలబడ్డాడు.

.★★★★



# పిల్లలకు డబ్బు విలువ నేర్పుదాం

మారకాలు వెంట వెంటనే జరగా లంటే, ఉపయోగపు విలువల వల్ల ఆటం కాలు ఏర్పడని పద్ధతి కావాలి. ఏ ఉపయో గపు విలువా లేకుండా, విలువ మాత్రమే వుండే వస్తువు కావాలి. అలాంటి వస్తువు తోనే మారకాలు తేలిగ్గా జరుగుతాయి. ఆ అవసరం కోసం ఏర్పడిన వస్తువే డబ్బు నాణెం.

డబ్బు నాణెం, బంగారంతో తయారవు తుంది. (బంగారంతోనే కాదు, వెండితో కూడా. వెండి సంగతి వదిలేద్దాం. ) బంగా రానికి విలువ వుంటుంది కాబట్టి, బంగా రంతో తయారైన డబ్బు నాణానికి కూడా విలువ వుంటుంది. కానీ ఈ వస్తువు, నాణెం రూపంలో వుంటుంది కాబట్టి, దీనికి, మామూలు వస్తువులకు వుండే ఏ సహజ ఉపయోగపు విలువా వుండదు. కుండ, చెప్పులు, కుర్చీ, దుప్పటి వంటి వస్తువులకు లాగ, డబ్బు నాణెం, ఏ సహజ అవసరాలకూ పనికిరాదు. కానీ, డబ్బు నాణానికి కూడా ఒక ఉపయోగపు విలువ వుంటుంది. మామూలు వస్తువులతో మార డానికి పనికిరావడమే ఆ ఉపయోగపు విలువ. ఆ నాణెం పుట్టిందే అందుకు. వస్తువులతో మారడానికి తప్ప, అది ఏ సహజ అవసరాన్నీ తీర్చదు.

అంటే, డబ్బు అనేది ఒక వస్తువే అయినా, దానికి కూడా ఒక ఉపయోగపు విలువ వున్నా అది సహజమైన వస్తువూ కాదు ; దాని ఉపయోగపు విలువ, సహజ మైన ఉపయోగపు విలువా కాదు. కాబట్టి, డబ్బుగా వున్న వస్తువుకి, అసలు ఉప యోగపు విలువే లేదని అర్థం.

ఆ నాణానికి, ఏ ఉపయోగపు విలువా లేకపోవడం వల్లనే, అది 'డబ్బు' అయింది. దానికి కూడా ఏదైనా ఉపయోగపు విలువ వుంటే, అది కూడా ఏదో ఒక మామూలు వస్తువే అయ్యేది. దానితో మారకం జరగా లంటే, దాని ఉపయోగపు విలువ ఎప్పుడో అప్పుడు అడ్డం వచ్చేది.

ఒక వస్తువులో నించి ఉపయోగపు విలువ విడిపోయి, బైటికి పోయి, అక్కడ విలువ ఒక్కటే మిగిలితే, ఆ వస్తువు ఎలా వుంటుంది? ఏ ఉపయోగపు విలువ తోటీ లంకె లేకుండా వుంటుంది. అలాంటి వస్తువే – డబ్బు! అది, విలువతో మాత్రమే వుంటుంది కాబట్టి, ఆ విలువ, వస్తువుల ప్రపంచంలో వున్న ఏ మామూలు వస్తు వుతోనైనా మారగలదు. (కొనగలదు ). డబ్బుకి ఆ అర్హత కలుగుతుంది. వస్తువుల్ని అమ్మదల్చుకున్న వాళ్ళకి, తమ వస్తువుల్ని ఇచ్చి డబ్బుని తీసుకోవడానికి ఏ అభ్యం తరమూ వుండదు. ఆ రకంగా, బార్టరు. మారకాల సమస్యని, డబ్బు, అద్భుతంగా

# ఆర్థిక శాస్త్రం

పరిష్కరించగల సాధనం అయింది.

అమ్మడమూ, కొనడమూ :

రామయ్య, తన కుండని అమ్మి, చెప్పుల్ని కొన్న ఉదాహరణలో, ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. (1) కుండని అమ్మిన మనిషి. (2) కుండని కొన్న మనిషి. ( 3 ) చెప్పుల్ని అమ్మిన మనిషి

(1) కుండని అమ్మిన మనిషి: ఈ

మనిషి, తను తయారుచేసిన వస్తువుని అమ్మాడు. ఆ వస్తువు విలువతో సమాన మైన డబ్బు వచ్చింది. అది, 1 రూపాయి. ఆ డబ్బే, కుండ 'విలువ'. ఇప్పుడు కుండ, అతనిది కాదు. ఆ రూపాయే అతనిది. అతనికి వెంటనే చెప్పులు కావాలి. చెప్పులు కొనేశాడు. చెప్పుల విలువ – 1 రూపాయి. ఆ డబ్బు వెళ్ళిపోయింది. చెప్పులు వచ్చాయి. ఇప్పుడు ఆ డబ్బు రామయ్యది కాదు. చెప్పులే అతనివి. తన శ్రమతో తయారు చేసిన కుండని అమ్మి, ఆ విలువ తోనే చెప్పులు కొన్నాడు కాబట్టి, అతని వస్తువు విలువ, ఎక్కడికీ పోలేదు. అతని విలువ, అతనికే అందింది.

(2) కుండని కొన్న మనిషి: ఇతను, జొన్నల్ని పండించే శ్రమ చేసే మనిషి. తన వస్తువుని అమ్ముకోవడం వల్ల అతని దగ్గర కొంత డబ్బు వుంది. ఆ డబ్బులో నించే 1 రూపాయితో కుండని కొన్నాడు. అతని జొన్నల విలువ ఎక్కడికీ పోలేదు. అతని విలువ, అతనికే అందింది.

( 3 ) చెప్పుల్ని అమ్మిన మనిషి: ఇతను తన శ్రమతో, చెప్పుల జతలు తయారు చేస్తాడు. ఒక జతని అమ్మి, 1 రూపాయి తీసుకున్నాడు. ఇతని వస్తువు విలువ, ఎక్కడికీ పోలేదు. దానికి బదులే ఆ డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో తర్వాత అతను ఏం చేస్తాడు? తన ఇంటి అవసరాలకు కావలసిన వస్తువు ఏదైనా కొనుక్కుంటాడు. లేకపోతే, ఆ రూపాయి నాణాన్ని కరిగించి, ఉంగరం లాంటి వస్తువు ఏదైనా చేయిం చుకుంటాడు. అప్పుడు ఇక ఆ డబ్బు వుండదు. ఆ నగ వుంటుంది. అది, బంగా రంతో వున్న నగ కాబట్టి, దానికి కూడా విలువ వుంటుంది.

ఈ ముగ్గురు మనుషుల మధ్యా, అమ్మ కాలూ, కొనుగోళ్ళూ జరిగాయి. వస్తువు వెళ్ళిపోయి, డబ్బు వస్తే, అది అమ్మకం. డబ్బు వెళ్ళిపోయి, వస్తువు వస్తే, అది – కొనుగోలు.

ఇక్కడ – జొన్నలూ, కుండా, చెప్పులూ అనే 3 వస్తువులు కనపడుతున్నాయి..

ఒక మనిషి, జొన్నలు అమ్మి, కుండని కొన్నాడు.

రెండో మనిషి, కుండని అమ్మి, చెప్పులు కొన్నాడు.

మూడో మనిషి, చెప్పులు అమ్మాడు.. ఇంకేదో కొంటాడు. ఇంకా కొనలేదు.

ఇందులో, ఏ 2 వస్తువుల మధ్య మారకం జరిగింది? కుండ సంగతి చూడండి. కుండకి, జొన్నలతో మారకం జరిగిందా, చెప్పులతో మారకం జరిగిందా?

జొన్నల మనిషికి ఎలా కనపడుతుం దంటే– తను, జొన్నల్ని అమ్మి, ఆ డబ్బుతో కుండని కొన్నాడు కాబట్టి, జొన్నలకీ కుండకీ మారకం జరిగినట్టు కనపడు తుంది.

కుండ మనిషికి ఎలా కనపడుతుం దంటే తను, కుండని అమ్మి, ఆ డబ్బుతో చెప్పులు కొన్నాడు కాబట్టి, కుండకీ – చెప్పు లకీ మారకం జరిగినట్టు కనపడుతుంది.

చెప్పుల మనిషికి ఎలా కనపడుతుం దంటే – తను, చెప్పుల్ని అమ్మిన డబ్బుతో ధాన్యాన్ని కొంటే, చెప్పులకూ ధాన్యానికీ మారకం జరిగినట్టు కనపడుతుంది.

ఇందులో ఏది నిజం? ఏదీ నిజం కాదు. ఇవి, బార్టరు పద్ధతి మారకాలు కావు; ఇక్కడ, ఏ 2 వస్తువులకూ సూటిగా మారకం జరగలేదు. ప్రతి వస్తువూ డబ్బు తోనే మారింది గానీ, ఇంకో వస్తువుతో మార లేదు. కుండ, జొన్నలతోనూ మారలేదు. చెప్పుల తోనూ మారలేదు. డబ్బుతోనే మారింది. ఆ డబ్బు వెళ్ళి చెప్పులతో మారింది. ఏ వస్తువుని చూసినా, అది డబ్బుతోనే మారింది.

(ఇంకా ఉంది )

# రేపటి తరం

## "లైటినింగ్"పరుగుల రోబో

రోబోలు (Humanoid robots) నిరూపించాయి. తాజాగా పరుగు పందెం పోటీలోనూ అవి సత్తాచాటుతున్నాయి. ఇప్పుడు ఏకంగా పరుగుల యోధుడు.. ట్రాక్పై చిరుతలా పరుగెత్తుతూ రికార్డుల మోత మోగించిన ఉసేన్ బోల్ట్ (Usain Bolt) నెలకొల్పిన ప్రపంచ రికార్డును ఓ హ్యూమనాయిడ్ రోబో బద్దలు కొట్టింది. చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ హానర్ అభివృద్ధి చేసిన లైటినింగ్ అనే హ్యూమనాయిడ్ రోబో 100 మీటర్ల పరుగును 9.32 సెకన్లలో పూర్తి చేసింది. జమైకా స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ 2009 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్స్ లో 9.58 సెకన్లలోనే 100 మీటర్ల రేసు పూర్తి చేసి వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు దానిని 'లైటినింగ్' అధిగమించింది. హ్యూమనాయిడ్ రోబోల తయారీ, అభివృద్ధిలో చైనా దూసుకుపోతోంది. ఇదే ఏడాది ఏప్రిల్లో జరిగిన 21 కిలోమీటర్ల బీజింగ్ హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఇందులో సుమారు 12 వేల మంది మనుషులు, 100కు పైగా హ్యూమనాయిడ్ రోబోలు పోటీ పడ్డాయి. ఈ క్రమంలో 21 కిలోమీటర్ల దూరాన్ని 50 నిమిషాల 26 సెకన్లలో లైటినింగ్ రోబో పూర్తి చేసి రికార్డు నెలకొల్పింది. మరో రోబో 51 నిమిషాల్లో, ఇంకో రోబో 53 నిమిషాల్లో తమ పరుగును పూర్తి చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.






## కథ




# ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం

ఒక నాడు ఓ కోతి అడవిలో గెంతుతూ వుంటే దాని కాలికి ఒక ముల్లు గుచ్చుకుంది. అది వూళ్ళోకొచ్చి ఒక మంగలిని ఆశ్రయించింది. మంగళి చక్కగా ముల్లు తీసి విసిరేశాడు. తిరిగి చూసేసరికి కోతి తన కత్తి తీసుకుని పారిపోవడం గమనించాడు.

"ఓ కోతి! ఓ కోతి! నా కత్తి!" అన్నాడు.

కోతి వెనక్కి తిరిగి, "ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం", అని వెక్కిరించి పారిపోయింది.

కత్తి తీసుకుని కోతి ఊళ్ళో తిరగడం మొదలుపెట్టింది.

ఒక వ్యక్తిని చేతితో కొబ్బరి మట్టలు కొట్టడం చూసింది. జాలిపడి అతని చేతికి కత్తి అందించింది. ఆ మనిషి సంతోశంగా మట్టెలు కత్తితో కొడుతుంటే, పక్కన పడేసిన మట్టెలను కోతి తీసుకుని ఉడాయించింది.

"ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం!

కత్తి పోయి మట్టలు వచ్చె ఢాం ఢాం ఢాం!" అని పాడుకుంటూ తన దారిని వెళ్ళిపోయింది కోతి.

దారిన ఒక బెల్లం కాచే ఆసామి నేల మీద బెల్లం అచ్చులు వేయడం చూసి, ఆ మట్టలు అతనికి ఇచ్చింది. ఆసామి మట్టలు పరుచుకుని బెల్లం అచ్చులు వాటిమీద పెట్టడం మొదలు పెట్టాడు. అలవటు ప్రకారం కోతి బెల్లం అచ్చులు తీసుకుని, వెక్కిరిస్తూ పారిపోయింది.

"ముల్లు పోయి కత్తి వచ్చె ఢాం ఢాం ఢాం!

కత్తి పోయి మట్టలు వచ్చె ఢాం ఢాం ఢాం!

మట్టలు పోయి అచ్చులు వచ్చె ఢాం ఢాం ఢాం!"

"న బెల్లం అచ్చులు! దొంగ కోతి!" అని లబోదిబోమంటూ ఆసామి చూస్తూ వుండిపోయాడు.

కొంచం దూరానికి ఒక పేదరాశి పెద్దమ్మ బెల్లం లేని చప్పిడి బూరెలు చేస్తూ కనిపించింది. కోతి ఆమెకు బెల్లం అచ్చులు ఇచ్చింది. పెద్దమ్మ బెల్లం బూరెలు చేయడం మొదలెట్టింది. అవి చేయంగానే కోతి వండి పెట్టిన బూరెలు తీసుకుని పరిగెట్టింది.

"ముల్లు పోయి కత్తి వచ్చె ఢాం ఢాం ఢాం!

కత్తి పోయి మట్టలు వచ్చె ఢాం ఢాం ఢాం!

మట్టలు పోయి అచ్చులు వచ్చె ఢాం ఢాం ఢాం!

అచ్చులు పోయి బూరెలు వచ్చె ఢాం ఢాం ఢాం!"



# కథ

కొంత సేపటికి కోతికి గోవుల కాపర్లు ఇద్దరు యెదురయ్యారు. వాళ్ళకి బూరెలు ఇచ్చింది. వాళ్ళు ఇష్టంగా బూరెలు తింటూ మయిమరిచిపోయారు. కోతి గోవును తోలుకుని వెళ్ళిపోయింది.

"కోతి! కోతి! మా గోవును ఇచ్చేయి!" అని చాలా దూరం కాపర్లు తరిమేరు. కాని కోతి వాళ్ళకు చిక్కలేదు.

"ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం!

కత్తి పోయి మట్టలు వచ్చే ఢాం ఢాం ఢాం!

మట్టలు పోయి అచ్చులు వచ్చే ఢాం ఢాం ఢాం!

అచ్చులు పోయి బూరెలు వచ్చే ఢాం ఢాం ఢాం!

బూరెలు పోయి గోవు వచ్చే ఢాం ఢాం ఢాం!"

రోజంతా పడ్డ శ్రమకి కోతి బాగా అలిసిపోయింది.

"అబ్బ! చాలా కష్ట పడ్డాను ఇవాళ, వొళ్ళంతా పులిసిపోయింది. వెణ్ణీళ్ళు కాచు, స్నానం చేసి విశ్రామిస్తాను," అని గోవును ఆజాపించింది.

గోవుకి బాగా కోపమొచ్చింది. సలసలా మరిగించిన నీళ్ళను తీసుకొచ్చి కోతి వంటిమీద భళ్ళున పోసేసింది. కోతి కుయ్యో మర్రో మని ఏడుస్తుంటే; తోలు వూడిన కోతిని చూసి నవ్వుకుంటూ ఆవు తన మందలోకి వెళ్ళిపోయింది.

★★★

# మెదడుకు మేత-1

## పొడుపు కథలు :

1.చెయ్యని కుండ , పొయ్యని నీరు ,వెయ్యని సున్నం ,తియ్యగా నుండు

2.సూర్యుడు చూడని గంగ , చాకలి ఉతకని మడుగు

## కనుక్కోండి చూడడం :

ఎన్ని మొఖాలు

ఉన్నాయో చెప్పండి ?



## కొంటె ప్రశ్నలు :

1. భక్తులు లేని దేవుడు ఎవరు

౨. భక్తులు లేని సాయి ఎవరు





# మహా భారతం - అత్రి మహర్షి

బ్రహ్మ మానస పుత్రుడు అత్రి మహర్షి. సప్తరుషుల్లో ఒకడిగా ప్రసిద్ధుడు. అష్ట ప్రకృతుల్లో అద్వితీయుడు.

వశిష్ఠునికి, విశ్వామిత్రుడికీ మధ్య విభేదాలు తల ఎత్తి ఒకరంటే మరొకరికి బొత్తిగా సరిపడకుండా పోయింది. ఒక రోజు కల్మశపాదుడనే రాజు జంతువులను వేటాడేందుకు అడవికి వెళ్ళాడు. అక్కడ అనుకోకుండా వశిష్ట మహర్షి కుమారుడు "శక్తి"ని రాజు గారు కలుసుకున్నాడు. కానీ, రాజుగారు ముని కుమారుణ్ణి ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా ఆయనపట్ల అగౌరవంగా ప్రవర్తించాడు. అందుకు శక్తి ఆగ్రహించాడు, రాక్షసుడిగా మారిపొమ్మని రాజుని శపించాడు. కల్మశపాదుడు నరమాంస భక్షకుడిగా మారిపోయాడు. వెంటనే శక్తిని సంహరించి పొట్టన పెట్టుకున్నాడు. ఇది తెలిసి విశ్వామిత్రుడు పరమానంద భరితుడయ్యాడు. పైగా కల్మశపాదుడి దగ్గరకు వెళ్ళి "వశిష్ఠుడి సంసారాన్ని నాశనం చేయడానికి కావలసిన సాయమంతా చేస్తాను" అని అభయం కూడా ఇచ్చాడు. ఆ రకంగా వశిష్ఠ మహర్షి కుమారులు నూరుగురిని రాక్షసుడు హతమార్చాడు.

వశిష్ఠుడు కొడుకుల్ని పోగుట్టుకొని భరించలేని దుఃఖంలో వున్నాడు. శక్తి చనిపోయేనాటికి అతని భార్య అదృశ్యంతి నిండు గర్భిణి. ఆమె దినా రాత్రులు నిద్రాహారాలు మాని భర్తకోసం పరితపించింది. పలకరిస్తే చాలు గుండె పగిలేలా ఏడ్చేది. అడవిలో ఆశ్రమంలో మూగగా బ్రతికింది. కొన్నాళ్ళకు ఆమె ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. అతనే పరాశరుడు.

పెద్దయ్యాక పరాశరుడికి తన తండ్రిని ఒక రాక్షసుడు చంపి భక్షించాడని తెలిసింది, ఉగ్రుడాయ్యాడు. మొత్తం రాక్షస జాతిని తుదముట్టించేందుకు ఒక మహాయజ్ఞాన్ని ప్రారంభించాడు. యజ్ఞం సాగుతోంది, క్రమేపీ వాడివేడి పుంజుకుంది. రాక్షసులు భయభ్రాంతులై పిచ్చిగా పరిగెత్తారు. దేవతలు, మునులు, పరాశరుడి తీవ్ర కోపానికి, యాగశక్తికి విస్తుపోయారు. ఆ సమయంలో అత్రిమహర్షి, మరి కొందరు మునులు పరాశరుని బ్రతిమాలి, నచ్చజెప్పి యాగం విరమించుకునేలా చేశారు. మహాభారతం ఆదిపర్వంలో ఈ కథ ఉంది.



# మహా భారతం

మరొకసారి దేవతలకు, రాక్షసులకు మధ్య భీకర యుద్ధం జరిగింది. అసురుల శస్త్రాగ్నికి సూర్యచంద్రులు తేజం కోల్పోయారు. సర్వత్రా చీకట్లు అలముకున్నాయి, చీకట్లను పారద్రోలమని దేవతలు అత్రి మహర్షిని వేడుకున్నారు. మహర్షి వారి కోరికను మన్నించి సూర్యచంద్రుల్లో విలీనం అయ్యాడు. వెంటనే చంద్రుడు వెన్నెల వెలుగులని దేవతలకు అందించాడు. ప్రచండ సూర్య తేజానికి అసురులు మలమలమాడి పోయారు. అత్రిమహర్షి వల్ల ఈ విధంగా దేవతలు రక్షింపబడినట్టు వాయుదేవుడు అర్జునుడికి చెప్పాడు. అనుశాసన పర్వములో ఈ కథ ఉంది

కశ్యపుడు, అత్రి, వశిష్టుడు, భరద్వాజుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, మరో ఇద్దరు మునిపత్నులు ప్రపంచ పర్యటనకు బయలుదేరారు. ఆ సమయంలో ఎక్కడ చూసినా కరువుకాటకాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. శిబి చక్రవర్తి కుమారుడు వృష ధర్భి ప్రపంచ పర్యటనలో ఉన్న ముని పుంగవులు పిలిచి గోవులు, బంగారం, వెండి ఆభరణాలను ఇచ్చి సత్కరించాలి అనుకున్నారు.

వెంటనే వాళ్ళ ఆహ్వానాలు పంపాడు. కానీ ఆ ఆహ్వానాన్ని మన్నించి తిరస్కరించారు.

హోమం చేసి అగ్నిగుండం నుండి ఒక రాక్షసిని సృష్టించాడు. అత్రిమహర్షి, ఇతర మునులను హతమార్చవలసిందిగా వృష ధర్భి రాక్షసిని ఆదేశించాడు అది వెళ్లి మారువేషంలో అడవిలో ఒక తామర కొలను దగ్గర నిలబడి ఉండగా అత్రి, ఇతర మహర్షులు అటుగుండా వెళ్లడం జరిగింది. మహర్షులు రాక్షసిని గుర్తించి, త్రిదండి తో దానిని చావబాదారు. తదనంతరం వాళ్లు బ్రహ్మలోకం వెళ్లారు.

అత్రి మహర్షి కుమారుడు దత్తాత్రేయుడు. దత్తాత్రేయ కుమారుడిని నిమి. నిమి కుమారుడు వెయ్యేళ్లు బ్రతికి ఆ తర్వాత తనువు చాలించాడు. తాతగారి ఆనతి మేరకు కుమారుడికి శ్రాద్ధకర్మలు జరిపించాడు నిమి. అప్పుడు అత్రి మహర్షి శ్రాద్ధకర్మల ప్రాముఖ్యాన్ని వివరించాడు.

(ఇంకా ఉంది )

## హిందీ నేర్చుకుందాం

| తెలుగు | హిందీ | అంకెలు |
|---|---|---|
| ఒకటి | ఏక్ | एक |
| రెండు | దో | दो |
| మూడు | తీన్ | तीन |
| నాలుగు | చార్ | चार |
| ఐదు | పాంచ్ | पाँच |
| ఆరు | ఛః | छः |
| ఏడు | సాత్ | सात |
| ఎనిమిది | ఆఠ్ | आठ |
| తొమ్మిది | నౌ | नौ |
| పది | దస్ | दस |
| పదకొండు | గ్యారహ్ | ग्यारह |
| పన్నెండు | బారహ్ | बारह |
| పదమూడు | తేరహ్ | तेरह |
| పద్నాలుగు | చౌదహ్ | चौदह |
| పదిహేను | పంద్రహ్ | पंद्रह |
| పదహారు | సోలహ్ | सोलह |
| పదిహేడు | సత్రహ్ | सत्रह |
| పద్దెనిమిది | అఠారహ్ | अठारह |
| పంతొమ్మిది | ఉన్నీస్ | उन्नीस |
| ఇరవై | బీస్ | बीस |

# మెదడుకు మేత – 1



ఈ లెక్కల లెక్క తెల్చేయండి ......

## మెదడుకు మేత

ఒక గుంపులో
ఒక నల్ల కోడి,
రెండు నల్ల మేకలు,
మూడు తెల్ల బాతులు,
నాలుగు తెల్ల గొర్రెలు
ఉన్నాయి.
ఎన్ని జంతువులు
తమ రంగు నలుపు
అని చెప్పగలవు.?

## మెదడుకు మేత

ఒక తరగతిలో పిల్లలకు
ఒక్కొక్కరికి రెండు చాక్లెట్లు
ఇస్తే ఒక విద్యార్థికి ఇవ్వలేము.
ఒక్కొక్క చాక్లెట్ ఇస్తే రెండు
చాక్లెట్లు మిగులుతున్నాయి.
అయితే తరగతిలో విద్యార్థులు
ఎంతమంది? మొత్తం ఎన్ని
చాక్లెట్లు?



desk
chair
books
notebooks
pencil case
backpack
scissors
compass
pins
clips
pencils
coloured pencils(U.K.)/ colored pencils (U.S.)
pencil sharpener
stapler
calculator
ballpoints
highlighter
rubber(U.K.)/ eraser (U.S.)
scotch tape
paint
palette
paintbrushes
protractor
ruler
set square
GLUE!
glue
beaker
flask
test tubes
funnel
binders
computer
papers
file holder
map
magnifying glass
clock
blackboard
globe

# ముల్లా నసీరుద్దీన్ కథలు





## బట్టలకు ఆహారం

ముల్లా నస్రుద్దీన్ రోజంతా పొలాల్లో పనిచేశాడు. అతను అలసిపోయి, చెమటతో తడిసిపోయాడు. అతని బట్టలు, బూట్లు బురద, మరకలతో నిండిపోయాయి. రంజాన్ మాసం సందర్భంగా రోజంతా ఉపవాసం ఉండటం వల్ల అతనికి బాగా ఆకలిగా కూడా ఉంది. కానీ చివరికి, సూర్యాస్తమయం కావస్తుండటంతో, త్వరలోనే తాను తినగలనని నస్రుద్దీన్‌కు అర్థమైంది.

పట్టణంలోని అత్యంత ధనవంతుడు ఆ సాయంత్రం తన ఇంటికి వచ్చి భారీ విందు ఇవ్వమని అందరినీ ఆహ్వానించాడు. పట్టణానికి బయలుదేరే ముందు బట్టలు మార్చుకోవడానికి ఇంటికి వెళితే ఆలస్యం అవుతుందని నస్రుద్దీన్‌కు తెలుసు. ఆలస్యం కావడం కంటే మురికి బట్టలతో వెళ్లడమే మేలని అతను నిర్ణయించుకున్నాడు. ఆహా, అదెంత గొప్ప విందు! అదెంత అద్భుతమైన విందు! ఆ ధనవంతుని ఇంటికి నడుస్తూ, నస్రుద్దీన్ తను త్వరలో తినబోయే రుచికరమైన ఆహార పదార్థాలను ఊహించుకున్నాడు: ఖర్జూరాలు, పప్పులు, శనగలు, ఆలివ్‌లు, రొట్టె, హమ్మస్, ఫలాఫెల్, చికెన్, బీఫ్ — అన్నింటికన్నా ముఖ్యంగా — హల్వా, ఖర్జూరపు రోల్స్, అంజూర పండ్లు, బక్లావా వంటి తీపి వంటకాలు!

నస్రుద్దీన్ రాగానే, ఆ ధనవంతుడు తలుపు తెరిచి, అతని చిరిగిన బట్టల నుండి బురద అంటిన బూట్ల వరకు నస్రుద్దీన్‌ను పైనుండి క్రిందికి అవమానకరంగా చూశాడు. ఒక్క పలకరింపు కూడా లేకుండా, అతను నస్రుద్దీన్‌ను లోపలికి రమ్మని సైగ చేసి, హఠాత్తుగా వెళ్ళిపోయాడు.

అందరూ తమ అత్యుత్తమ వస్త్రాలు ధరించి ఉన్న జనసమూహంలో నస్రుద్దీన్ కలిశాడు. బల్లలు రకరకాల రుచికరమైన ఆహార పదార్థాలతో నిండి ఉన్నాయి: ఖర్జూరాలు, కాయధాన్యాలు, శనగలు, ఆలివ్‌లు, రొట్టె, హమ్మస్, ఫలాఫెల్, చికెన్, బీఫ్ — అన్నింటికన్నా ముఖ్యంగా — హల్వా, డేట్ రోల్స్, అంజూర పండ్లు, బక్లావా వంటి తీపి వంటకాలు!

అతను త్వరపడటానికి ప్రయత్నించినప్పటికీ, సీట్లన్నీ నిండిపోయాయి మరియు నస్రుద్దీన్ కోసం ఎవరూ పక్కకు జరగడానికి లేదా చోటు ఇవ్వడానికి ప్రయత్నించలేదు. నిజానికి, ఎవరూ అతనికి ఆహారం అందించలేదు. తన ప్లేటులోకి ఆహారం తీసుకోవడానికి అతను జనాలను దాటుకుంటూ, చుట్టూ చేతులు చాచుకుని వెళ్ళవలసి వచ్చింది. ఎవరూ అతనితో మాట్లాడలేదు. అతను అక్కడ లేనట్లే ప్రవర్తించారు.



# ముల్లా నసీరుద్దీన్ కథలు

ఇతర అతిథులు అతన్ని పూర్తిగా పట్టించుకోకపోవడంతో, తన పళ్ళెంలోని ఆహారం ఎంత చక్కగా తయారు చేసినా, ఎంత రుచిగా ఉన్నా నస్రుద్దీన్ దాన్ని ఆస్వాదించలేకపోయాడు. నిజానికి, కొన్ని ముద్దలు తిన్న తర్వాతే నస్రుద్దీన్‌కు చాలా అసౌకర్యంగా అనిపించి, అక్కడి నుండి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

అతడు తొందరగా ఇంటికి వెళ్లి, ఒక అందమైన కోటుతో సహా తన అత్యంత శ్రేష్ఠమైన దుస్తులను ధరించాడు.

నస్రుద్దీన్ విందుకు తిరిగి రాగా, ఈసారి ఆతిథేయుడు పెద్ద చిరునవ్వుతో అతనికి స్వాగతం పలికాడు. "లోపలికి రండి, లోపలికి రండి," అని ఆతిథేయుడు పలకరించాడు. నస్రుద్దీన్ లోపలికి ప్రవేశించగానే, గదిలోని నలుమూలల నుండి ప్రజలు అతనికి చేతులు ఊపుతూ, పిలుస్తూ, తమ దగ్గర కూర్చోమని ఆహ్వానించి, ఆహారం అందించారు.

నస్రుద్దీన్ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. ఒక లావుపాటి అత్తి పండును తీసుకుని, దానిని జాగ్రత్తగా కోటు జేబులో పెట్టుకుంటూ, "తిను, కోటు, తిను" అని అన్నాడు. (నాయకుడు — మీరు నకిలీ ఆహారాన్ని తెచ్చి ఉంటే, దీనిని చేసి చూపించండి.) తరువాత అతను గుప్పెడు గింజలను తీసుకుని జేబులో పెట్టుకుంటూ, "తిను, కోటు, తిను" అని అన్నాడు. ఇప్పుడు అతను అన్ని రకాల ఆహార పదార్థాలను పట్టుకుంటూ, తన కోటుకు శ్రద్ధగా తినిపించడం ప్రారంభించాడు. (నాయకుడు — ఇక్కడ ఆగి, నస్రుద్దీన్ తన కోటుకు తినిపించి ఉండగల కొన్ని ఆహార పదార్థాల పేర్లను చెప్పమని పిల్లలను అడగండి. వారి సూచనలను ఉపయోగించండి: "నస్రుద్దీన్ ___ ను తన జేబులో పెట్టుకుంటూ, 'తిను, కోటు, తిను!' అని అన్నాడు.)

అతను కోటకు కాయధాన్యాలు, శనగలు, ఆలివ్‌లు, బ్రెడ్, హమ్మస్, ఫలాఫెల్, చికెన్, బీఫ్ తినిపించాడు — అన్నింటికన్నా ముఖ్యంగా — హల్వా, డేట్ రోల్స్, అంజీర్ పండ్లు, బక్లావా వంటి డెజర్ట్‌లు!

వారు ఈ వింత ప్రవర్తనను చూస్తుండగా నస్రుద్దీన్ మౌనంగా ఉండిపోయాడు. కొద్దిసేపటికే గదిలో ఉన్నవారందరూ అతను ఏమి చేస్తున్నాడోనని ఆశ్చర్యపోతూ నస్రుద్దీన్ వైపు తదేకంగా చూడసాగారు.

ఆతిథేయుడు హడావిడిగా అతని వద్దకు వచ్చాడు. "నస్రుద్దీన్, నువ్వేం చేస్తున్నావ్? నీ కోటుకు ఈ విధంగా ఎందుకు ఆహారం పెడుతున్నావ్?"

"అయితే," అని నస్రుద్దీన్ బదులిచ్చాడు, "నేను మొదటిసారి నా పాత వ్యవసాయపు బట్టలతో ఈ విందుకు వచ్చినప్పుడు, నాకు స్వాగతం లభించలేదు. నాతో ఎవరూ మాట్లాడలేదు. కానీ నేను ఈ కోటు వేసుకున్నప్పుడు, అకస్మాత్తుగా నన్ను ఆప్యాయంగా పలకరించారు. దాంతో ఈ విందులో నాకు కాదు, నా బట్టలకే స్వాగతం లభించిందని నేను గ్రహించాను. అందుకే నేను నా కోటుకు మేత పెడుతున్నాను.".

★★★

# కథ



## హితవు

ఒక అడవికి కొన్ని కోతులు నివాసం ఉండేవి. వేసవికాలం రావడంతో  అడవిలోని చెరువులు, నీటికాలువలు పూర్తిగా ఎండిపోయాయి. ఒక రోజు కోతులకు విపరీతమైన దాహం వేసింది. నీటి కోసం వెతుకుతూ అవి అడవిని దాటాయి. అక్కడ ఇసుకలో నీటి అలల్లా ఎండమావులు మెరుస్తూ కనిపించాయి.

వాటిని నీటిగా భావించిన కోతులు మూకుమ్మడిగా అటువైపు  పరుగెత్తాయి. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే అక్కడ నీళ్ళు లేవు సరికదా మరి కొంత దూరంలో నీటి అలలు మెరుస్తూ కనిపించాయి. దానితో కోతులు తిరిగి ముందుకు  పరుగెత్తాయి. ఆ విధంగా కోతులు ఆ ఎండలో ఎండమావుల వెంట నీటి కోసం వెతుకుతూనే ఉన్నాయి.

" నీళ్ళతో గొంతు తడుపుకొకపోతే నా ప్రాణం పోయేలా ఉంది " దీనంగా అంది ఒక కోతి.

" ఏం చేద్దాం... నీళ్ళు కనబడుతున్నాయి కానీ చేతికి అందడం లేదు. ఇదేమి మాయో..." అంది మరొక కోతి. పొదలో ఒక కుందేలు నివాసం ఉంటోంది. ఆ  కుందేలు జరిగిందంతా చూసింది. కోతులకు సహాయం చేయాలని వచ్చి వాటి ముందు నిలబడింది.

“ఎండమావుల్లో ఎక్కడైనా నీరు ఉంటుందా? దగ్గరలో చెరువు ఒకటి ఉంది. అక్కడికి వెళ్లి మీ దాహం తీర్చుకోండి” అని చెప్పింది. ఇది విని కోతులకి చాలా కోపం వచ్చింది.

“మేం తెలివితక్కువ వాళ్ళమా? ” అంటూ ఒక కోతి కుందేలు పైకి దూకి దాని మెడ పట్టుకుంది. “నేను చెప్పేది నిజం. నా మాటలు నమ్మండి” భయంగా అరిచింది కుందేలు. ఆ కోతి కుందేలును బలంగా నేలకేసి కొట్టింది. ఆ దెబ్బతో కీచుగా అరుస్తూ కుందేలు ప్రాణం విడిచింది.

నీతి: మూర్ఖులకు హితవు చెబితే దాని పర్యవసానం ఇలాగే వుంటుంది.★★★

# మెదడుకు మేత – 2

=\కింద చిత్రం లో కొన్ని వస్తువులు దాగున్నాయి , అవి ఏమిటో చెప్పండి



సుమబాల
పిల్లల మాస పత్రిక





# భయం

మారుతీపురంలో ఉండే ఆకాష్కి చాలా గుండె ధైర్యం. దేనికీ భయపడే వాడు కాదు.

ఒకసారి వాడు ఏదో పని పడి భీమాపురానికి బయలుదేరాడు. ఆ ఊరికి వెళ్ళే దారిలో ఒక చింత చెట్టు ఉంది. 'ఆ చెట్టులో ఒక దెయ్యం ఉంది' అని చెప్పుకునేవాళ్ళు. "పగటి పూట అది ఎవరినీ ఏమీ అనదు; కానీ రాత్రి పూట మాత్రం ఎవరైనా అటుగా వచ్చినట్లయితే వాళ్లని రకరకాలుగా భయపెట్టి పగలబడి నవ్వుతుంది" అనుకునేవాళ్ళు అంతా. ఎవరో ఆకాష్కు కూడా చెప్పారు ఆ సంగతి: "చీకటి పడేలోపు చింత చెట్టు దాటి పో" అని.

అయితే వీడు ధైర్యవంతుడుకదా, భయపడలేదు. చెట్ల కొమ్మలు నరికే కత్తితో పాటు కొన్ని సామానులను తన చేతి సంచిలో పెట్టుకొని, భీమాపురానికి బయలుదేరాడు. ఊరికి వెళ్ళి పని ముగించే సరికి సాయంత్రం అయింది.

"వెళ్ళొస్తాను ఇంక" అని మారుతీపురానికి బయలు దేరాడు వాడు. ఆ ఊళ్ళో వాళ్ళత్త "ఇప్పుడు, ఈ సమయంలో వద్దులేరా, రేపు ప్రొద్దున్నే వెళ్తువు. దారిలో చింతచెట్టు దగ్గర అల్లరి దెయ్యం ఉంది. దానితో నీకెందుకు?" అన్నది. కానీ మనవాడు దానికి భయపడలేదు. "నేను వెళ్లాల్సిందే" అని పంతం పట్టి, చీకటి పడుతుండగా తమ ఊరికి బయలు దేరాడు.

చింతచెట్టును చేరుకునే సరికి చీకటి పడుతున్నది. దయ్యం ఆకాష్ ని చూడగానే చెట్టు మీది నుండి క్రిందికి దూకింది. గబగబా ఆకాష్ ముందుకు వచ్చి నిలబడి, "హి హి హీ!" అని నవ్వింది. చీకటిలో దాని పళ్ళు మిలమిలా మెరిసాయి.

ఆకాష్ తన సంచీలో చెయ్యి పెట్టి పట్నంలో కొనుక్కొచ్చిన మాస్క్ ఒకదాన్ని బయటికి తీసాడు. అది బ్రహ్మరాక్షసుడి మాస్క్. వాడు ముఖానికి దాన్ని పెట్టుకొని, దయ్యం కంటే భయంకరంగా నవ్వాడు!

దయ్యం ఒకక్షణం బిత్తరపోయింది. అయినా తేరుకొని, తన



# కథ

చేతి గోళ్ళు ముందుకి చాచింది. వాడిగా, వంకరలు తిరిగి వెన్నెలలో మిలమిల మెరిసాయవి.

మనవాడు గబుక్కున సంచిలో చెయ్యి పెట్టి, తను కొనుక్కున్న గ్లవ్స్ బయటికి తీసాడు. అవి ప్లాస్టిక్ గోర్లతో ఇంకా బాగా మెరిసాయి. వీడు వాటిని చేతులకు తగిలించుకొని, మరింత ధైర్యంగా దయ్యం వైపుకు నడిచాడు. “ఓలమ్మో! నిజం రాక్షసుడు!” అని అరుస్తూ దయ్యం వెనక్కి తిరిగి పరుగు పెట్ట సాగింది. వీడు తను తెచ్చుకున్న కత్తి పట్టుకొని దాని వెంట పడి, చివరికి దాని జుట్టు పట్టుకొని వెనక్కి లాగాడు!

ఆశ్చర్యం, దయ్యం జుట్టు పూర్తిగా ఊడి చేతులోకి వచ్చింది! “ఓలమ్మో! నా జుట్టు! నా జుట్టు పీక్కున్నాడు రాచ్చసుడు!” అని గట్టిగా అరిచిందది.

“ఎహె! రాచ్చసుడు లేడు, గీచ్చసుడు లేడు” అంటూ పొదల్లోంచి బయటికొచ్చిన మరొక దయ్యం, ఆకాష్ని చూడగానే కెవ్వున కేక పెట్టింది.

ఒక చేత్తో దయ్యం జుట్టును, మరొక చేత్తో కత్తిని చేత పట్టుకున్న ఆకాష్ వాటిని ఊపుతూ, ఇంకా బలంగా నవ్వుతూ “ఇప్పుడు దొరికినై దయ్యాలు! మనుషుల్ని తినీ తినీ నాకు విసుగు పుట్టింది. ఇప్పుడు వీటిని తిని పండగ చేసుకుంటాను” అని అరిచాడు. “అయ్యో! చమించు! మేం మడుసులమే! మమ్మల్ని వదిలెయ్యి” అంటూ కాళ్ల మీద పడ్డాయి ఆ దయ్యాలు రెండూ.

ఆకాష్ ఒక్క క్షణం బిత్తర పోయాడు. అయితే వెంటనే తేరుకొని “మడుసులైతే దయ్యాల వేసం వేసినారు ఎందుకురా?!” అని అరిచాడు. ”మా మడుసులు ఇక్కడ నిదులకోసం తవ్వుతున్నారు సోమీ, నడి రేత్తిరి వరకూ పని నడుస్తాది. అందుకని ఇక్కడికి వేరే ఎవ్వరూ రాకుండా మేం ఇట్లా వేసం వేసినాం” చెప్పింది ఒక దయ్యం, ఏడుస్తూ.

“నేను ఆ నిధులకు కాపలాగా వచ్చిన కొత్త రాక్షసుడిని. మర్యాదగా ఇక్కడినుండి పోయారా, సరే సరి. లేకపోతే రేపు రాత్రి మిమ్మల్ని అందరినీ కాల్చుకొని తింటాను” అని వాటిని బెదిరించి, పొదల్లోకి తరిమి, తన దారిన తాను చక్కా పోయాడు ఆకాష్.

తర్వాతి రోజున “పోలీసులను వెంటబెట్టుకొని అక్కడంతా తిరుగుదామా” అనుకున్నాడు గానీ, “అంత అవసరం ఉండదు” అని ఆగిపోయాడు వాడు. అయితే వాడి మంత్రం పని చేసినట్లుంది. ఆరోజునుండి అక్కడ ఎవ్వరికీ ఇక దయ్యం కనిపించలేదు. జనాలు ఆ దారిన నిర్భయంగా తిరగసాగారు.

★★

# అన్నదమ్ముల కథ



రామాపురంలో నివసించే పర్వతాలుకు ఇద్దరు కొడుకులు. పెదవాడు చాలా తెలివైనవాడు. చిన్నవాడు

మోసం చేస్తాడేమో, ఇద్దరూ కలిసి బ్రతుక్కునే విధానం చూడాలి" అని.

అదే బెంగతో అతను మంచం పట్టాడు. చివరికి చనిపోబోతుండగా అతను పిల్లలిద్దరినీ పిలిచి, ఇద్దరికీ తన ఆస్తులైన మామిడి చెట్టు, ఆవు, ఒక కంబళి చూపించి– "వీటిని మీరిద్దరూ అనుభవించాలి!" అని సైగలు చేసి చెబుతూ కన్నుమూసాడు.

మరుసటి రోజున పెద్దవాడు తమ్ముడిని పిలిచి "ఒరే, తమ్ముడూ! నాన్న మనకు ఒకే చెట్టు, ఒకే ఆవు, ఒకే కంబళి ఇచ్చాడు కదా; వాటిని మనం ఎలా పంచుకుందా– మంటావు?" అని అడిగాడు.

"వాటిని అమ్మి చెరిసగం తీసుకోవచ్చుగానీ, మనం అట్లా చేయకూడదు. స్వర్గంలో ఉన్న నాన్న ఆత్మ సంతోషపడాలంటే మనం వీటిని కలిసి అనుభవించాలి" అన్నాడు తమ్ముడు. "అదేరా, నేను చెప్పేది కూడాను. వీటిని మనం ముక్కలు చేయకూడదు– కనుక వాటిని కలసి ఉపయోగించుకుందాం. చెట్టు మొదలు నీకు, పై భాగం నాకు. అట్లాగే ఈ కంబళిని పగలంతా నువ్వు వాడుకో, రాత్రంతా నేను వాడుకుంటాను. ఇక ఆవు ముందు భాగం నీకు, వెనుక భాగం నాకు!" అన్నాడు అన్న తెలివిగా.

అయోమయం తమ్ముడికి అందులోని కపటం అర్థం కాలేదు. "నువ్వెట్లా అంటే అట్లా చేద్దాం. నీ మాట కాదంటానా అన్నయ్యా?!" అనేసాడు.

ఇక ఆనాటి నుండి ప్రతి రోజూ తమ్ముడు చెట్టు మొదలుకు నీరు పోసేవాడు. ఆవు నోట్లోకి మేత, కుడితి అందించేవాడు. కంబళిని ఏ రోజుకారోజు ఉతికి, ఆరవేసి, మడత పెట్టేవాడు.

చెట్టు కొమ్మలకు కాసిన కాయలు, పండ్లు తీసుకునేవాడు అన్న; ఆవు పాలు తను పిండుకునేవాడు– పేడ అంతా తనే తీసుకునేవాడు; తమ్ముడు ఉతికి పెట్టిన కంబళిని చక్కగా రాత్రిపూట కప్పుకునేవాడు!

# కథ



ఇలా కొంతకాలం గడిచిపోయింది. అన్నకు, తమ్ముడికి ఇద్దరికీ పెళ్ళి అయ్యింది. తమ్ముడి భార్య లక్ష్మి తెలివైనది. భర్త అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అతని అన్న ఎలా మోసం చేస్తున్నాడో గమనించింది.

ఒక రోజు ఉదయాన్నే చెట్టుకు నీరు కడుతున్న భర్తతో లక్ష్మి "ఇదిగోయ్యా, గొడ్డలి తీసుకురా, ఓ మాట" అన్నది. అతను గొడ్డలి తేగానే, "ఇదిగో, ఈ మాను మొదలు నీదే కదా, మీ అన్నది కాదు కదా?" అన్నది.

"అవును–నాదే" అన్నాడు తమ్ముడు.

"మరైతే ఇంకేమి, దీన్ని నరుకు. పొయ్యిలోకి కట్టెలు లేవు" అన్నది లక్ష్మి, దగ్గర్లోనే నిలబడి వింటున్న పెద్దాయనను గమనిస్తూ.

తమ్ముడు చెట్టుకు ఒక్కవేటు వేసాడో లేదో, అన్న వచ్చి అడ్డుకున్నాడు "మొదలు కొడితే మొత్తం చెట్టు చనిపోతుంది. కొట్టకు. ఇక నుండి మనం ఇద్దరం చెట్టుకు నీళ్ళు పోద్దాం; కాసే కాయల్ని కూడా సమానంగా పంచుకుందాం" అన్నాడు.

ఆరోజు సాయంత్రం అన్న ఆవు పాలు పిండుకుంటుండగా భర్తను పిలుచుకొని అక్కడికి చేరుకున్నది లక్ష్మి. ఆవుకు మొక్కుకొని, దాని ముఖాన్ని కడిగి, బొట్టు పెట్టి, "ఇదిగో,

ఈ ఆవు ముందు భాగం నీదే కదయ్యా?" అన్నది భర్తతో. "అవును" అన్నాడు తమ్ముడు.

"మరైతే ఒక బెత్తం తెచ్చి, కొద్ది సేపు దీని మూతిమీద కొట్టు" అన్నది లక్ష్మి.


తమ్ముడు ఆమెకేసి అదోలాగా చూసాడు కానీ, అన్న ముందుకొచ్చి "ఇదిగో, అలా చెయ్యకు. ఆవు తన్నిందంటే పాలన్నీ నేలపాలు అవుతాయి. ఇకమీద ఆవును ఇద్దరం మేపుదాం: పాలు కూడా చెరి సగం తీసుకుందాం" అన్నాడు.

ఆరోజు సాయంత్రం అవుతుండగా కంబళిని నీళ్ళలో నానబెట్టింది లక్ష్మి. రాత్రికి దాన్ని కప్పుకునేందుకు వచ్చిన అన్న దాన్ని గమనించి "ఒరే! తప్పయిపోయింది. మనం ఇద్దరం రోజుమార్చి రోజు దీన్ని ఉతుకుదాం, ఇద్దరం రోజుమార్చి రోజు ఉపయోగిం చుకుందాం. నన్ను క్షమించు" అన్నాడు.

'లక్ష్మి తెలివి తేటలు గలది' అని గమనించాక అతను పూర్తిగా మారిపోయాడు. అన్నింటా తమ్మునికి సమాన అవకాశాలిస్తూ వచ్చాడు.

అటుపైన రెండు కుటుంబాలూ కలతలు లేకుండా సఖ్యంగా జీవించాయి!

★★★



# రాజా రెడ్డి

గ్రహీత. ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, కాటూరు గ్రామంలో జన్మించిన ఆయన అమెరికాలో స్థిరపడ్డాడు. కంప్యూటర్ సైన్సు, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) రంగాలలో ఖ్యాతి గడించాడు. గత 40 సంవత్సరాలకుపైగా స్టాన్‌ఫర్డ్, కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయాలలో ఆచార్యుడిగా సేవలందిస్తున్నాడు. రోబోటిక్స్ సంస్థకు డైరక్టరుగా కూడా ఉన్నాడు. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి (ఐఐఐటీ) ఛైర్మన్ గా కూడా ఉన్నాడు. అల్పాదాయ వర్గాల వారు, ప్రతిభావంతులైన యువతీ, యువకుల విద్యావసరాలను తీర్చడానికి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ స్థాపనకు సహాయం చేశాడు. ఆసియా ఖండంలో ట్యూరింగ్ అవార్డు పొందిన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందాడు. కంప్యూటర్ విజ్ఞానంలో ఇచ్చే అత్యున్నతమైన ఈ అవార్డు కృత్రిమ మేధస్సు రంగంలో ఆయన చేసిన కృషికి 1994 లో లభించింది.రాజ్ రెడ్డి చిత్తూరు జిల్లా, బుచ్చినాయుడు ఖండ్రిగ మండలం, కాటూరు గ్రామంలో జన్మించాడు. ఆయన తండ్రి శ్రీనివాసులు రెడ్డి, తల్లి పిచ్చమ్మ గృహిణి. ఆయన తాత ఒక భూస్వామి. దాన ధర్మాల వల్ల వారి ఆస్తి కరిగిపోయింది. రాజ్ రెడ్డి తల్లి దండ్రులకు ఏడుగురు సంతానం. నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుర్లు. వారిలో రాజ్ రెడ్డి నాలుగోవాడు. రాజ్ రెడ్డి మొట్టమొదటిసారిగా తన గ్రామంలోని పాఠశాలలోనే ఇసుకలో అక్షరాలు నేర్చుకున్నాడు. ఐదో తరగతి దాకా అదే ఊళ్ళో చదివాడు. ఆరో తరగతి నుంచి పదో తరగతి దాకా శ్రీకాళహస్తిలో చదివాడు. పదో తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడవడంతో మద్రాసు లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్ చదవడానికి అవకాశం వచ్చింది. పదో తరగతి దాకా తెలుగు మాధ్యమంలోనే చదివాడు. ఇంటర్మీడియట్ లో ఆంగ్ల మాధ్యమంలో చేరినప్పుడు కొంచెం ఇబ్బంది పడ్డాడు. మెల్లగా ఆంగ్లం మీద పట్టు తెచ్చుకుని ఇంటర్మీడియట్ మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ప్రతిభ, మౌఖిక పరీక్ష ఆధారంగా గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు దొరికింది.[2] 1958 లో చెన్నైలో మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన గిండీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ప్రస్తుతం అన్నా విశ్వవిద్యాలయం) నుంచి సివిల్ ఇంజినీరింగ్ లో బ్యాచిలర్స్ పట్టా పుచ్చుకున్నాడు

మద్రాసులో ఇంజనీరింగ్ పూర్తి కాగానే మద్రాసు పోర్టు ట్రస్టులో ఇంజనీరుగా ఉద్యోగం వచ్చింది. అప్పుడు ఆయన జీతం మూడు వందల రూపాయలు. ఉద్యోగం చేస్తున్నప్పుడే మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆస్ట్రేలియాలో పైచదువుల కోసం దరఖాస్తు చేశాడు.



# సైన్స్ కథలు ..

అలా 1960 లో ఆస్ట్రేలియా వెళ్ళి అక్కడ న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ సంపాదించాడు. మాస్టర్ డిగ్రీ చేసేటప్పుడే కంప్యూటర్ల మీద కలిగిన ఆసక్తి వలన ఐబిఎంలో ఉద్యోగంలో చేరి అక్కడే మూడేళ్ళపాటు పనిచేసి కంప్యూటర్ మెళకువలు తెలుసుకున్నాడు. కంప్యూటరు గురించి మరింత పరిశోధన చేయాలన్న తపనతో స్టాన్ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పీ.హెచ్.డీకి దరఖాస్తు చేశాడు. 1966 లో స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్ లో డాక్టరేటు సంపాదించాడు. స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మొట్టమొదటి డాక్టరేట్ అందుకున్న ఘనత ఆయనదే. అదే సంవత్సరం స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా తన అధ్యాపక వృత్తిని ప్రారంభించాడు. తరువాత పిట్స్‌బర్గ్ లోని కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరాడు. అక్కడే ఆయన కెరీర్ కు బలమైన పునాది పడింది. కృత్రిమ మేధస్సు రంగం ప్రపంచాన్ని శాసిస్తుందని ఊహించి ఆ రంగం వైపు తన దృష్టి మళ్ళించాడు. ప్రస్తుతం సమాజంలోని సేవారంగంలో టెక్నాలజీ, సార్వత్రిక డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు మీద, భారతీయభాషలలో సంభాషణల అనువాదం మీద కృషి చేస్తున్నాడు.భవిష్యత్తులో మనుషులు చేయాల్సిన చాలా పనుల్ని రోబోలు చేస్తాయని ఆయన బృందం ముందుగానే ఊహించింది. ఆయన పనిచేస్తున్న విశ్వవిద్యాలయానికి ఆ రంగంపైన ఆసక్తి కలిగి దానికోసం ప్రత్యేకంగా ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలా కోట్ల రూపాయల ఖర్చుతో మొట్టమొదటి రోబోటిక్స్ ఇన్‌స్టిట్యూట్‌ని నెలకొల్పి దానికి పన్నెండేళ్ల పాటు వ్యవస్థాపక డైరెక్టర్‌గా పనిచేశాడు. ఇప్పటికీ ప్రపంచంలో అదే అతిపెద్ద రోబోల పరిశోధనా కేంద్రం. రోబోలకు మాటలూ, భాషలూ నేర్పించడం, పదాల్ని గుర్తుపెట్టుకునే శక్తినివ్వడం, మాటల ద్వారా ఇచ్చిన ఆదేశాలకు స్పందించడం లాంటి అనేక అంశాలను మొదట అభివృద్ధి చేసింది శాస్త్రవేత్తల బృందంలో ఆయన ముఖ్యుడు. కృత్రిమ మేధస్సులో ఆయన పరిశోధనలకు గుర్తింపుగా ఆసియాలోనే తొలిసారి ప్రతిష్ఠాత్మక ట్యూరింగ్ అవార్డు దక్కింది. రోబోటిక్ ఇన్‌స్టిట్యూట్ ఓ స్థాయికొచ్చాక యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌కు పదేళ్లపాటు డీన్‌గా ఉన్నత హోదాలో పనిచేశాడు. అమెరికన్ అసోసియేషన్ ఫర్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంస్థను స్థాపించి దానికి అధ్యక్షుడిగా పనిచేశాడు.

బిల్ క్లింటన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన ఐటీ సలహా సంఘానికి కో-ఛైర్మన్‌గా పనిచేశాడు. ఫ్రాన్స్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం నిరుపేదలకూ సామాన్యులకూ ఉపయోగపడే సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఓ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆ ప్రాజెక్టుకు ఆయన ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశాడు. తక్కువ ఖర్చులోనే కంప్యూటర్లను తయారు చేసి 80వ దశకం తొలిరోజుల్లోనే ఆఫ్రికా దేశాల్లోని పాఠశాలలకు వాటిని అందేలా చూశాడు. వైద్యం, రోడ్డు ప్రమాదాల నివారణ, మందుపాతర్లూ, ప్రకృతి విపత్తుల గుర్తింపు లాంటి అనేక రంగాల్లో ఉపయోగపడేలా రోబోల తయారీకి పునాది వేశాడు. ఆయన సేవలకు గుర్తింపుగా అప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడు మిట్టరాండ్ స్వయంగా అమెరికా వచ్చి ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారమైన లీజియన్ ఆఫ్ ఆనర్‌ను అందించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), రోబోటిక్స్, కంప్యూటర్ సైన్స్, స్పీచ్ రికగ్నిషన్ (మాటల గుర్తింపు) లో చేసిన కృషికి రాజ్ రెడ్డికి కంప్యూటర్ హిస్టరీ మ్యూజియం (సిహెచ్‌ఎం) 2021 ఫెలో అవార్డును ప్రదానం చేశారు.★★★★1★★★★

# నీతి చంద్రిక కథలు





ఆచార్య ఇరపని మాధవి

## పింగళకుడు – కరటక దమనకుల కథ

దక్షిణ దేశంలో రక్షావతి అనే పట్టణంలో వర్ధమానుడు అనే వ్యాపారి ఉన్నాడు. అతడు తనకంటే ధనవంతులైన తన బంధువులను చూచి వారి కంటే ఎక్కువగా ధనం సంపాదించాలని భావించి ఈ విధంగా ఆలోచించాడు. " నాలుగు పురుషార్థాలలో అర్థం ఉత్తమమైనది. ధనవంతుడికి ఈ లోకంలో అసాధ్యమైనదేది ఉండదు. కనుక పురుషుడు న్యాయం తప్పకుండా ఉపాయం చేతనైనా ధనం సంపాదించాలి. ఇంత సంపాదించాను, ఇంక చాలు అని తృప్తి పడకూడదు. బుద్ధిమంతుడైనవాడు ముసలితనం చావు లేనివాడిలాగా విద్యని ధనాన్ని సంపాదించాలని పెద్దలు చెబుతారు. ధనం సంపాదించటానికి అనేక సాధనాలున్నాయి. వాటన్నిటిలో వ్యాపారం అన్ని విధాల ఆలోచించాడు. పరాయి దేశంలో వ్యాపారం చేయటానికి అవసరమైన తన దేశంలో దొరికే మంచి సరకులనేకం బండ్ల మీద,గుర్రాల మీద,కంచరగాడిదల మీద ఎత్తించి కొన్నిటిని మోయటానికి బరువు మోసేవారిని నియమించుకొని మంచి బండికి సంజీవక నందకములనే బలిసిన ఎద్దులను పూన్చి తగిన పరివారంతో ఉత్తర దేశానికి ప్రయాణమయ్యాడు.

చాలా దూరం ప్రయాణించి సుదుర్గమనే కొండ దగ్గర అడవిలో పోతుండగా సంజీవకం బండి లాగలేక లాగుతూ జారి మోకాలు విరుగగా నేలమీద పడిపోయింది. వెంటనే సార్థవాహుడు బండి దిగి సంజీవకం మెడ కాడికట్టు వదిలించి రెండవ ఎద్దును విడిపించాడు. ఆ వ్యాపారి " ఇది మంచి ఎద్దు. ఇక్కడ ఆగి దీనికి తగిన వైద్యం చేయించుకొని పోదామన్నా ఇది మహారణ్యం, నిలువ దగిన చోటు కాదు. ఈ ఎద్దుకు అడవి పాలు కావాలని రాసుందేమో! విధి బాగా లేనప్పుడు ఎలాంటి పౌరుషం పనిచేయదు. మంచో చెడో ఏ కాలంలో రావలసింది అది రాక మానదు. కనుక ఒక కష్టం వచ్చిందని ఆగిపోకూడదు. వెనుకబడితే దానివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు" అని ఆలోచించి తన సరకుబండ్లను దారిలో సాగిపోండి అని ఆజ్ఞాపించాడు.

# నీతి చంద్రిక కథలు



కొంత పరివారాన్ని బండికి కాపలా ఉంచి అక్కడకు దగ్గరలో ఉన్న ధర్మపురమనే గ్రామానికి వెళ్లి ఒక బలమైన ఎద్దును కొని తెచ్చి బండికి కట్టించుకొని సాగిపోయాడు.

తర్వాత ఆ అడవిలో సంజీవకం అదృష్టం కొలదీ ఏ క్రూరజంతువుల బారిన పడక విరిగిన మోకాలు బాగయ్యి లేచి నడవసాగింది. ఆ ఎద్దు అడవిలో తిరుగుతూ మంచి పచ్చిక మేత కడుపు నిండా తింటూ బలిసింది. ఒకరోజు పర్వత గుహలు మారుమోగేటట్లుగా పెద్దగా రంకె వేసింది. ఆ అడవిలోనే పింగళకుడనే సింహం ఉంది. అది పులులను ఖండిస్తూ, అడవి పందులను బాధపెడుతూ, అడవిదున్నలను బాధిస్తూ ఎలుగులను శిక్షిస్తూ, మిగిలిన మృగాలను లెక్క చేయక ఇష్టం వచ్చినట్లు విహరిస్తుండేది. ఆరోజు దాహంతో యమునా నది ఒడ్డుకు పోతూ ప్రళయ కాలంలోని ఉరుములాంటి సంజీవకుడి భయంకరమైన ధ్వని విని భయపడి ఆశ్చర్యంతో కదలకుండా నిల్చుండిపోయింది.

ఆ అడవిలోనే కరటక దమనకములనే నక్కలున్నాయి. అవి కూడా సంజీవకుడి రంకె విని అదిరిపడ్డాయి. ఆ తర్వాత ధైర్యం తెచ్చుకొని చూపులు చుట్టూ సారించి చెవులు నిక్కించి విన్నాయి. కరటకుడు "మరల శబ్దం లేదు, నువ్వూ విన్నావు కదా! ఇంతకాలం నుంచి మనం ఈ అడవిలోనే ఉంటున్నాం. ఇలాంటి భయంకరమైన కూత ఇంతవరకు వినలేదు" అన్నాడు. దానికి దమనకుడు "ఔనౌను,

ముందు విన్నది కాదు. ఈ శబ్దంహాశ్చర్యం . అదిగో మన రాజుపింగళకుడు యమునా తీరానికిపోయేవాడు భయపడి నిల్చున్నాడు, ఆధ్వని విని కాబోలు. అంతవాడే అట్లవ్వగామన మెంతవారము" అన్నాడు. దానికికరటకుడు "ఇంత భయంకరమైన అరుపుఅరిచిన జంతువు చిన్నదై ఉండదు. ఎక్కడినుంచి వచ్చి ఆ జంతువు ఈ అడవిచేరింది? ధ్వనిమాత్రం విన్నాం కానీ ఆజంతువును చూడలేదు. నిన్న రాత్రో,ఈరోజు వేకువనో అది ఇక్కడకు వచ్చిచేరుంటుంది. ఇంక ఏమి కష్టాలు వస్తాయోఎవరికి తెలుసు "అన్నాడు. దానికిదమనకుడు "ఈ అడవి మనకుశాశ్వతమా? ఇంకొక దగ్గరకు పోకూడదనిఏమైనా నియమముందా? న్మస్థలంఎవరికైనా

విడవటం కష్టమే. అలా అని చావు తెచ్చుకుంటామా?

చావు తెచ్చుకుంటామా? అయినా ఇప్పుడుఇంత ఆలోచన ఎందుకు? మనకేమికష్టమొచ్చింది? ఆ జంతువును చూడనేలేదు. ఒక్కోసారి జంతువు చిన్నదైనా కూతపెద్దది కావచ్చు. ఆ జంతువు అంతభయంకరం కాకపోవచ్చు. శబ్దం వచ్చినవైపు చూడు. అక్కడి జంతువులు ఏమాత్రం కలత పడిన సూచనలు లేవు"అన్నాడు. దానికి కరటకుడు " నీవుచెప్పింది నిజమే. కానీ ఇది ఇలాంటిజంతువు కూత అని తెలియలేదు" అంటూకొంతసేపు ఆలోచించి చిరునవ్వు నవ్విఇప్పటికి గుర్తుకొచ్చింది. కొన్ని రోజులక్రితం ఒక వర్తకుడు కాలిరిగిన తన ఎద్దునుఇక్కడ విడిచిపెట్టి పోయాడు. అదిఅక్కడక్కడ గడ్డిపరకలు తింటూ కండపట్టితిరుగుతుండటం చూశాను. ఇప్పుడుమనం విన్నది దాని రంకె. అనవసరంగాపిరికితనంచ్చుకున్నాం. మనకంటే శూరుడు మన రాజు" అన్నాడు. దానికి

దమనకుడు " మనం పింగళకుడి మంత్రికూమారులమై ఇప్పుడు ఉపేక్షించకూడదు.అతడి దగ్గరకు వెళ్లి అతడి భయంమాన్పిద్దాం. ఈ వంకతో ఉద్యోగంసంపాదించి అతడి అనుగ్రహంపొందవచ్చు. రాజనుగ్రహం పొందినవారికిఅన్ని సంపదలు కలుగుతాయి. మనకురాజనుగ్రహం ముఖ్యం కానీ ఈమూర్ఖత్వమెందుకు" అన్నాడు. దానికికరటకుడు " దమనకా! ఇతడి సంగతి నాకుసరిపడదు. ఇంతకు ముందు కొలువు చేసిపడినపాట్లు చాలు. ఇతడు చెప్పుడుమాటలు విని యుక్తాయుక్తాలువిచారించడు. ఇతడి దగ్గర కొలువు చాలాకష్టం. అది అలా ఉండనీ. పొట్టకూటికోసం ఇతరులనాశ్రయించటంవిడువదగింది. ఇతరులకధీనమైనవాడుచచ్చినవాడితో సమానం. సేవకుడిసేవ యజమాని చేత గుర్తించబడితే కనీసం సేవాదుఃఖం పోతుంది. అదే హీనంగా చూడబడితే అంతకన్నా దుఃఖం లేదు. సేవవృత్తితో లభించే పాయసం కంటే స్వేచ్ఛావర్తనంతో లభించే గంజే మేలు. కనుక లభించిన దానితో తృప్తిగా ఉందాం. ఇప్పుడతని భయం పోగొట్టవలసిన పనిలేదు. మనకు కాని పనికి పూనుకుంటే ఆపద కలుగుతుంది. మనమిప్పుడతని సేవకులం కాదు. అతని భయం పోగొట్టవలసిన పని మనది కాదు. ఆ పని ఇప్పుడు అతని దగ్గర పని చేస్తున్న కొత్త సేవకులది. అక్కడక్కడ జంతువుల డొక్కలు వెదకటం మన పని. జంతువులు తినగా మిగిలిన మాంసం అడవిలో చాలా దొరుకుతుంది. రా పోయి తిందాం" అన్నాడు.

# బాల గేయం

దానికి దమనకుడు " దానికిప్పుడు తొందరేముంది? నిదానంగా వెళ్లి తిందాములే. జంతువులన్నిటికీ ఆహారం నిద్ర భయాలు సహజ ధర్మాలు. పొట్టనింపుకున్న మాత్రాన గౌరవం కలుగదు.

మిత్రులకు మేలు శత్రువులకు కీడు చేయటం కోసం బుద్ధిమంతులు రాజాశ్రయం కోరతారు. పొట్ట నింపుకోవటం కోసమే కాదు. మాంసంలేనిది, దుర్వాసన వచ్చేది, శుష్కించిన ఎముక దొరికిందని కుక్క సంతోషపడుతుంది కానీ దాని ఆకలి ఆ ఎముకతో కొంచెం కూడా తీరదు. సింహం దగ్గర కొచ్చిన చిన్న జంతువులని లెక్కచేయక తను వేటాడిన ఏనుగు తలలోని మెదడునే కోరుతుంది. అందరూ తమ బలానికి తగిన దానినే కోరుకుంటారు. కుక్క తనకు ఆహారం పెట్టేవారి దగ్గర చేరి తోకాడిస్తుంది. నేలమీద పడి తన నోరు కడుపు చూపిస్తుంది. ఇన్ని పాట్లు పడితే దానికొక ముద్దకంటే ఎక్కువ పెట్టరు. అదే ఏనుగుకు మావటివాడు బుజ్జగిస్తూ ముద్ద తినిపిస్తాడు. హీనుడు ఎంతదయనీయంగా వేడినా పెట్టరు. అదేగౌరవం కలిగినవారికి వినయంగా కోరికతీరాపెడతారు. నిందింపరాని విద్యచే పరాక్రమంకలిగిన అపాయంలేని ఉపాయంతో రాజులమెప్పు పొందినవారి జీవితమే జీవితం.పొట్టకూటి కోసమే బ్రతకటం ఒక బ్రతుకేనా?కుక్క అయినా బతకుతుంది కదా!ఇతరులకు మేలు చేయగల జీవితంఒక్కరోజైనా చాలు. మంచిచెడుల వివేకంలేకుండా తిండికోసమే బ్రతికేవాడుపశువుతో సమానం. అంతేకాదు,బరువులు మోసేది గడ్డి మాత్రమేఆహారంగా కలది వ్యవసాయానికిఉపకరించే పవిత్రమైన జన్మకలిగిన ఎద్దునరపశువు కంటే మేలు" అంది. దానికికరటకుడు" దమనకా! మనం మంత్రులంకాదు. మనకీ ఆలోచనలతో ఏం

ప్రయోజనం?" అంది.

(ఇంకా ఉంది )

**-ఆచార్య ఇరపని మాధవి**

**బాల గేయం**

బుర్రుపిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది
పడమటింటి కాపురము చేయనన్నది
అత్తతెచ్చిన కొత్తచీర కట్టనన్నది
మామతెచ్చిన మల్లెపూలు ముడువనన్నది
మొగునిచేత మొట్టికాయ తింటానన్నది



# రోబో కథలు

## రాము - రోబో







ఒక రోజు రాము రోబోను వెంట పెట్టుకు తన స్నేహితులతో కలసి విహార యాత్రకు వెళ్ళాడు

# రోబో కథలు




విహార యాత్రలో కొండలు కోణాలు పచ్చని పొలాలు ఎన్నో చూసి ఆనందించారు




అందరు అక్కడ దగ్గర లోని డాం దగ్గరకు వెళ్ళారు

# రోబో కథలు



అక్కడ కొంతమంది తీవ్రవాదులు డం ని కులచాలని ప్రయత్నించటం రోబో చూసింది




రోబో అక్కడ ఉన్న అందరి తీవ్రవాదులతో ఒకేసారి పోరాడింది (ఇంకా ఉంది )

సుమబాల
పిల్లల మాస పత్రిక

# విక్రమార్క భేతాళ కథలు






## దేవహూతి .

పట్టువదలని విక్రమార్కుడు మరలా స్మశానం చేరుకుని చెట్టుపైన ఉన్న బేతాళుని బంధించి తనభుజంపైన చేర్చుకుని మౌనంగా నడవసాగాడు.

శవాన్ని ఆవహించిఉన్నబేతాళుడు "భళా విక్రమార్క నీపట్టుదల మెచ్చదగినది. నాకు దేవహూతి గురించి తెలుసుకోవాలనిఉన్నది సకలకళావల్లభుడవైన నీవు నాకు తెలియజేయి తెలిసిచెప్పకపోయావో మరణిస్తావు "అన్నాడు.

" బేతాళా శతరూప స్వయంభువమనువుల కుమార్తె. ఈమెకు ఆకూతి –ప్రసూతి అనే సోదరిమణులు ఉన్నారు. ఈమె తన భర్తకు,శ్రీమహావిష్ణువు ను దర్శించిన వారికి మాత్రమే కనిపిస్తుంది.ఇతరుల కంటికి కనిపించదు .ఆకూతి రుచీకుని–ప్రసూతి దక్షుని వివాహంచేసుకున్నారు.

ఈమెకుతగిన వరును అన్వేషిస్తూ,ప్రజాపతులలో ఒకరైన కర్దమ ముని ఆశ్రమంచేరిన స్వయంభూవమనువు "అయ్యమీవంటి మహాపురుషులు చేపట్టవలసిన కన్యకారత్నం నాబిడ్డ దేవహూతి దయచేసి చేపట్టవలసినదిగా ప్రార్ధిస్తున్నాను"అని వేడుకున్నాడు.

అతనికోరిక మన్నించిన కర్దమముని దేవహూతిని వివాహంచేసుకుని, తనతపోశక్తిచే అత్యంత వేగంగా పయనించే పుష్పకవిమానం రప్పించి, ఎన్నోసుందర ప్రదేశాలతోపాటు,సమస్తద్వీపాలు విహరించి. మహిమాన్వితమైన సరస్వతి నదిలో

# భేతాళ కథలు



స్నానం ఆచరించి,బిందు సరోవరం వద్ద ఆశ్రమం నిర్మించుకునిఆనందంగా జీవించే ఈదంపతులకు కళ–అనసూయ–శ్రద్ధ–హరిర్భువు–గతి–క్రియ–ఖ్యాతి–అరుంధతి–శాంతి అనేతొమ్మిదిమంది కుమార్తేలు జన్మించారు.

కాలక్రమంలో కర్ధమముని తపోవనాలకు వెళ్ళబోతుండగా,దేవహూతి ఓక్క సద్గుణ సంపన్నుడు అయిన పుత్రుని ప్రసాదించి,కుమార్తేల వివాహం జరిపించమని వేడుకుంది.అంగీకరించిన కర్ధమముని 'కపిలుడు'అనే పుత్రుని ప్రసాదించి,బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు తనకుమార్తేలను మారీచ–ఆత్రి–అంగీరస–పులస్య–పులహా–కత్రు–భృగు–వశిష్ఠ–అధర్వులకు తనకుమార్తేలకు ఇచ్చి వివాహంజరిపించాడు. వనవాసంలో తపోదీక్షతో స్వర్గం చేరాడు.కుమారుని ద్వారా జ్ఞానబోధపొంది, భర్తమార్గాన్నే దేవహుతి అనుసరించింది " అన్నాడు విక్రమార్కుడు.

అతనికి మౌనభగంకావడంతో శవంతోసహ మాయమైన బేతాళుడు మరలా చెట్టుపైకిచేరాడు.

పట్టువదలని విక్రమార్కుడు బేతాళునికై మరలా వెనుతిరిగాడు.

★★★★

# చూపించాల్సిన సినిమా

ఇవాల్టి రోజున ఎటువంటి సినిమాలు వస్తున్నాయో అందరికి తెలిసిందే , వాటి వాటిని చూసి పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారో కూడా అందరికి తెలుసు . సినిమా చెడ్డది కాదు .మంచి సినిమా పిల్లలకు చూపిస్తే దానివల్ల ఎంతో ప్రయోజనం కుడా ఉంటుంది . అందుకే ఇక్కడ మంచి సినిమాలను పరిచయం చేస్తున్నాము .




సిసింద్రీ చిట్టిబాబు 1971 లో ఎ. సంజీవి దర్శకత్వంలో విడుదలైన సినిమా. ఇందులో శోభన్ బాబు, శారద, మాష్టర్ ప్రభాకర్ ముఖ్యపాత్రల్లో నటించారు. రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం తాతినేని చలపతిరావు అందించారు. ఒకానొక సమయంలో తెలుగు చిత్రసీమలో బాలల చిత్రాలు జనాన్ని భలేగా ఆకట్టుకున్నాయి. ఎంత పేరు మోసిన తారలు నటించినా, 'చైల్డ్ సెంటిమెంట్' అంటూ ఉంటే, కథ రక్తి కట్టిస్తుందని సినిమాజనం నమ్మకం. అదే తీరున కొందరు టాప్ స్టార్స్ చిత్రాల్లోనూ చైల్డ్ సెంటిమెంట్ బాగా పండి, ఘనవిజయాలు లభించాయి. కొన్ని సార్లు అలాంటి సినిమాలతోనే కొందరికి మరింత పేరు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. 1970ల ఆరంభంలో రూపొందిన 'సిసింద్రీ చిట్టిబాబు' ఆ కోవకు చెందినదే.

# చూపించాల్సిన సినిమా



శోభన్ బాబు స్టార్ డమ్ అందుకోవడానికి దాదాపు పుష్కరకాలం పట్టింది. ఆ సమయంలో శోభన్ బాబు, శారద జంటగా, మాస్టర్ ప్రభాకర్ ప్రధాన పాత్రలో 'సిసింద్రీ చిట్టిబాబు' తెరకెక్కింది. 1971 జూన్ 18న విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణ చూరగొంది. ఈ చిత్రాన్ని రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై తమ్మారెడ్డి కృష్ణమూర్తి, ఎ.సంజీవి దర్శకత్వంలో నిర్మించారు.

చిట్టిబాబు మరోజన్మ–

ఈ చిత్రంలో చిట్టిబాబు చేసే పనులు భలే సరదాగా ఉంటాయి. తనను ప్రాణంగా ప్రేమించే అన్నయ్య అంటే చిట్టిబాబుకు ప్రాణం. తన అన్న ప్రేమించిన అమ్మాయితో పెళ్ళయ్యేలా చూస్తాడు చిట్టిబాబు. అలాగే తమ ఊరి మాస్టార్ కోరుకున్న పిల్లతోనే పెళ్ళి జరిపిస్తాడు. పిల్లాడు ఇంతున్నా, చేసేవి పెద్దపనులు. అందువల్ల ఊళ్ళో కొందరికి చిట్టిబాబు అంటే ఎంతో ఇష్టం. మరికొందరికి అతనంటే ద్వేషం. అలా చిట్టిబాబు అంటే నచ్చని స్కూలు కరస్పాండెంట్ అతణ్ణి ఫెయిల్ చేయిస్తాడు. ఎప్పుడూ తన అన్న కొడుకుతో ఆడుకుంటూ ఉండే చిట్టిబాబు, ఆ కారణంగానే చదువులో ఫెయిల్ అయ్యాడని అన్న భావిస్తాడు. బాగా చదువుకుంటేనే బాబుతో ఆడుకోనిస్తానని అన్న అంటాడు. దాంతో చిట్టిబాబు, బాబును తీసుకొని పారిపోతాడు. బాబును పెంచడానికి పలు పాట్లు పడతాడు. చివరకు చిట్టిబాబు అన్న రాము వచ్చి పిలిచినా, బాబును తీసుకొని గుడిగోపురం ఎక్కుతాడు. నిన్ను ఏమీ అనని చెబుతాడు రాము. చిట్టిబాబు దిగబోయి కాలుజారి కిందపడి మరణిస్తాడు. తరువాత ఓ పెద్ద కోటీశ్వరుని ఇంట్లో పుట్టిన చిట్టిబాబు స్కూల్ పిల్లలతో విహారయాత్రకు వెళ్ళినప్పుడు ఆ గోపురం చూసి గత జన్మ గుర్తుకు వస్తుంది. అన్న, వదినల దగ్గరకు వచ్చిన చిట్టిబాబు వారిని వీడి వెళ్ళనంటాడు. చివరకు ఆ ధనవంతుడు, తనకు కొడుకు తప్ప ఎవరూ లేరని చెబుతాడు. అందువల్ల చిట్టిబాబు అన్నావదినెలను, పిల్లాడిని, వారి బామ్మను కూడా తమతో పాటే రమ్మని చెబుతాడు కోటీశ్వరుడు. అలా కథ సుఖాంతమవుతుంది.

ఈ చిత్రంలో చిట్టిబాబుగా మాస్టర్ ప్రభాకర్ నటించగా, అతని అన్నావదినెలుగా శోభన్ బాబు, శారద అభినయించారు.

ఈ సినిమాకు ముందు శోభన్ బాబు, శారద నటించిన 'మనుషులు మారాలి' చిత్రం ఘనవిజయం సాధించింది. ఇందులోనూ వారిద్దరూ జంటగా నటించడం, ఈ సినిమా కూడా మంచి ఆదరణ పొందడంతో వారిద్దరూ హిట్ పెయిర్ గా నిలిచారు. ఆ తరువాత అనేక చిత్రాలలో శోభన్, శారద జోడీ ప్రేక్షకులకు కనువిందు చేసింది.

గుమ్మడి, అల్లు రామలింగయ్య, రాజబాబు, సూర్యకాంతం, రాధాకుమారి, గోకినరామారావు, మాడా, ఓ స్పెషల్ సాంగ్ లో నగేశ్, జ్యోతిలక్ష్మి కనిపించారు. ఈ చిత్రానికి టి.చలపతిరావు సంగీతం సమకూర్చగా, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, కొసరాజు పాటలు రాశారు. ఈ చిత్ర నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి సినిమా అనుకరణ రూపొందించారు. ఈ చిత్రానికి తమ్మారెడ్డి కృష్ణమూర్తి పెద్ద కొడుకు లెనిన్ బాబు సహ నిర్మాతగా వ్యవహరించారు. తరువాతి రోజుల్లో "దత్తపుత్రుడు, డాక్టర్ బాబు" వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు లెనిన్ బాబు. ఇక ఈ చిత్రానికి కథ సమకూర్చిన పినిశెట్టి, ప్రముఖ దర్శకుడు రవిరాజా పినిశెట్టి తండ్రి. అలాగే ఈ చిత్ర దర్శకుడు ఏ. సంజీవి

★★★



# వండర్ కిడ్స్




మహారాష్ట్రకు చెందిన వండర్ కిడ్ వేదా పరేష్ సర్ఫరే (Veda Paresh Sarfare) కేవలం 1 సంవత్సరం 9 నెలల 10 రోజుల వయసులోనే 100 మీటర్ల దూరం ఈది అత్యంత పిన్న వయస్కురాలైన స్విమ్మర్‌గా సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది.

సాధించిన రికార్డు: భారతదేశంలోనే అత్యంత పిన్న వయసులో (Youngest Swimmer) 100 మీటర్ల దూరం ఈదిన రికార్డు.సమయం: 100 మీటర్ల దూరాన్ని (25 మీటర్ల పూల్‌లో 4 ల్యాప్స్) కేవలం 10 నిమిషాల 8 సెకన్లలో పూర్తి చేసింది.గుర్తింపు: ఈ అద్భుతమైన ప్రతిభకు గాను ఆమె పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ (India Book of Records) మరియు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైం

## ధారావాహిక



# అశ్వత్థామ

అశ్వత్థామ మహాభారతంలో ద్రోణుని కుమారుడు. ఇతని తల్లి కృపి. ఇతడు మరణము లేని చిరంజీవి. ద్రోణాచార్యునికి కడు ప్రియమైనవాడు. కురుక్షేత్ర సంగ్రామం చివరిలో కౌరవుల పక్షాన మిగిలిన ముగ్గురిలో ఒకడు. తన కుమారుడు మరణించాడన్న వదంతులకు కుంగిపోయిన ద్రోణుడు అస్త్ర సన్యాసం చేసి దృష్టద్యుమ్నుని చేతిలో మరణం పాలైనాడు. కక్షతో రగిలిపోయిన అశ్వత్థామ చనిపోతున్న తండ్రి దగ్గర యుద్ధానంతరం ఎలాగైనా దృష్టద్యుమ్నుని చంపేటట్లు అనుమతి తీసుకున్నాడు.

పురాణాల ప్రకారం, ద్రోణాచార్యుడు–కృపి భార్యాభర్తలు. వీరికి పెళ్లయి ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగలేదు. ఎన్ని పూజలు చేసిన ఫలితం దక్కకపోవడంతో ఈ దంపతులు హిమాలయాలకు చేరుకుని అక్కడ స్వయంభుగా వెలిసిన శివలింగాన్ని పూజ చేసి కఠినమైన తపస్సు చేస్తారు. అప్పుడు శివుని శక్తితో సమానమైన కుమారుడు పుట్టాలని కోరుకుంటారు. అలా శివుడి అంశతో ద్రోణాచార్యుల దంపతులకు అశ్వత్థామ జన్మించాడు. తను పుట్టిన సమయంలో ఏడుపు అశ్వం శబ్దంలా ఉండటంతో తనకు అశ్వత్థామ అనే పేరొచ్చింది. అయితే తను పుట్టినప్పటి నుంచి ద్రోణుడికి అనేక కష్టాలు ఎదురయ్యాయి. అంతేకాదు తన వల్ల అశ్వత్థామకు కూడా అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో తనకు గోమాతను దానం ఇవ్వాలని చాలా మందిని కోరినా ఫలితం రాలేదు. అయితే చివరకు అష్టకష్టాలు పడుతూ హస్తినాపురానికి చేరుకుని పాండవులు, కౌరవులకు అస్త్ర విద్యలు నేర్పించే గురువుగా బాధ్యతలు స్వీకరించాడు. అలా వారితో పాటు అశ్వత్థామ కూడా అన్ని విద్యలు నేర్చుకున్నాడు.

ఇతడు సప్తచిరంజీవులలో ఒకడు. సప్తచిరంజీవులు. వీరు..... 1. అశ్వత్థామ, 2. బలిచక్రవర్తి. 3. వ్యాసమహర్షి. 4. హనుమంతుడు. 5. విభీషణుడు. 6. కృపాచార్యుడు. 7. పరశురాముడు.

మహాభారత యుద్ధానంతరం తాను ఎలాగైనా పాండవులను చంపుతానని అశ్వత్థామ దుర్యోధనునకు మాట ఇచ్చాడు. యుద్ధం చివరి రోజున అశ్వత్థామ గుడ్లగూబపై కాకులు పగటి పూట ఎలా దాడి చేస్తాయో, అలాగే రాత్రిపూట గుడ్లగూబలు తిరిగి ఆ కాకులపై ఎలా తిరుగుబాటు చేస్తాయో నిశితంగా పరిశీలించి పాండవులను చంపడానికి

ఒక పథకం రూపొందించాడు. అశ్వత్థామ కృతవర్మ, కృపాచార్యునితో కలిసి రాత్రి వేళలో దాడి చేయడానికి పాండవుల శిబిరానికి వెళ్ళాడు. కానీ అక్కడ శ్రీకృష్ణుడు ఏర్పాటు చేసిన రక్కసి వారిని అడ్డగించింది. కానీ అప్పటికే కృష్ణుడు సాత్యకితో సహా పాండవులందర్నీ గంగానదీ తీరానికి తరలించాడు.

తన తండ్రి మరణవార్త తెలిసిన అశ్వత్థాముడు పాండవులను ఎలాగైనా చంపేయాలన్న కసితో రగిలిపోతాడు. దుర్యోధనుడి అనుమతితో.. పాండవులను హతం చేసేందుకు రంగంలోకి దిగుతాడు. దొరికిన వారిని దొరికనట్టు మట్టుబెడతాడు. యుద్ధంలో అర్జునుడు, కర్ణుడి తర్వాత ఎక్కువ మందిని చంపింది అశ్వత్థాముడే. అర్ధరాత్రి పూట పాండవులు నిద్రిస్తోన్న ప్రాంతంపై దాడికి పాల్పడతాడు. ఈ విషయాన్ని పసిగట్టిన కృష్ణుడు పాండవులను అక్కడి నుంచి తప్పిస్తాడు. కానీ అశ్వత్థాముడి దాడిలో పాండవ పుత్రులు సహా దాదాపు వారి సైన్యమంతా తుడిచిపెట్టుకుపోతుంది.

అశ్వత్థామ తన శరీరాన్ని సమర్పించడం ద్వారా శివుణ్ణి మెప్పించి ఆ రాత్రి అతన్ని చూసిన వారు చనిపోయేలా వరం పొందాడు. అర్ధరాత్రిలో పాండవులను చంపడానికి వారి శిబిరానికి వచ్చాడు. ద్రౌపదీ పుత్రులైన ఐదుమంది ఉపపాండవులను చంపివేస్తాడు. ఇది తెలుసుకున్న పాండవులు అశ్వత్థామను వెంబడిస్తారు. అర్జునుడు అశ్వత్థామతో యుద్ధానికి తలపడతాడు. అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. ప్రతిగా అర్జునుడు కూడా ప్రయోగిస్తాడు. ఆ రెండూ ఢీకొంటే ప్రళయం తప్పదని భావించిన ఋషులు ఇద్దరినీ బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించుకోమంటారు. అర్జునుడు విజయవంతంగా బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించుకోగా అశ్వత్థామ అలా చేయలేక పోతాడు. కానీ ఆ బ్రహ్మాస్త్రానికి ఏదో ఒక లక్ష్యాన్ని చూపించాలి కనుక పాండవుల మీద ద్వేషంతో రగిలిపోతున్న అశ్వత్థామ పాండవ స్త్రీల గర్భాల మీదకు దారి మళ్ళిస్తాడు. వారిలో అర్జునుని కోడలు ఉత్తర కూడా ఉంది. ఆమె కడుపులో ఉన్నది. పాండవుల తర్వాత సింహాసనాన్ని అధిష్టించాల్సిన పరీక్షిత్తు. బ్రహ్మాస్త్ర ఫలితంగా పరీక్షిత్తు తల్లి గర్భంలోనే మరణిస్తాడు. కానీ కృష్ణుడు తన యోగమాయతో మృత శిశువును తిరిగి బతికిస్తాడు. అశ్వత్థామను 3 వెల సంవత్సరాలపాటు కుష్టు వ్యాధి గ్రస్థుడివి కమ్మని కృష్ణుడు శపిస్తాడు.

అశ్వత్థాముడు ఇప్పటికీ బతికే ఉన్నాడని ఉత్తరాదిన చాలా బలంగా నమ్ముతారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ డాక్టర్‌కు ఆయన కనిపించాడని చెబుతుంటారు. హిమాలయ పర్వత సానువుల్లో గిరిజనులతో కలిసి అతడు జీవిస్తున్నాడని ప్రచారంలో ఉంది. తన శరీరంపై కారుతున్న నెత్తురును కట్టడి చేసేందుకు నూనె, పసుపు అడుగుతారని అక్కడి వారు చెబుతుంటారు. అశ్వత్థామ ఏడాదిలో ఒకరోజు ఓ హోటల్‌కు వచ్చి కడుపు నిండా తిని, వంద లీటర్ల నీటిని తాగి మాయం అవుతాడనే కథనం కూడా ప్రచారంలో ఉంది. మళ్లీ మరుసటి ఏడాది మాత్రమే అతడు ఆ హోటల్‌కు వస్తాడట. కావాలనుకున్నప్పుడు మాత్రమే కనిపించే శక్తులు అశ్వథ్థామకు ఉన్నాయని, అందుకే ఆయన అందరికీ కనిపించడని చెబుతుంటారు.

★★★



# పృథ్వీరాజ్ చౌహాన్

మదనుపూరు శాసనాలు పృథ్వీరాజు మహోబాను దోచుకున్నాడని నిర్ధారిస్తున్నాయి. కానీ చారిత్రక ఆధారాల ప్రకారం చందేల భూభాగం మీద ఆయన ఆక్రమణ బందిపోట్ల కల్పన కావచ్చు లేదా ఎక్కువ కాలం కొనసాగలేదు. చౌహాన్ల విజయం తర్వాత పరమర్ది వెంటనే మరణించలేదని లేదా పదవీ విరమణ చేయలేదని తెలిసింది; వాస్తవానికి పృథ్వీరాజు మరణించిన దాదాపు ఒక దశాబ్దం తర్వాత కూడా ఆయన సార్వభౌమాధికారిగా పరిపాలన కొనసాగించాడు. సింథియా టాల్బోటు వాదిస్తూ పృథ్వీరాజు కేవలం జేజకభుక్తి మీద దాడి చేశాడని మహోబా నుండి ఆయన నిష్క్రమించిన వెంటనే పరమర్ది తన రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడని పేర్కొంది. పృథ్వీరాజు చందేల భూభాగాన్ని తన రాజ్యంలో విలీనం చేయలేకపోయారని టాల్బోటు కొనసాగించింది. దీనికి విరుద్ధంగా ఆర్.బి. సింగ్ ప్రకారం చందేల భూభాగంలో కొంత భాగాన్ని చహమానులు స్వల్ప కాలం పాటు విలీనం చేసుకుని ఉండవచ్చని భావించవచ్చు.

'ఖరతర-గచ్ఛ-పట్టావళి' పృథ్వీరాజు, గుజరాతు చాళుక్య (సోలంకి) రాజు 2వ భీమ మధ్య జరిగిన శాంతి ఒప్పందాన్ని ప్రస్తావించింది. దీనిని బట్టి ఆ ఇద్దరు రాజులు గతంలో యుద్ధంలో ఉన్నారని తెలుస్తుంది. ఈ యుద్ధం సా.శ. 1187 (1244 విక్రమ సంవత్సరం) కి ముందు ఏదో ఒక సమయంలో జరిగి ఉండవచ్చు.

# అమరవీరులు

వేరావలు శాసనం భీముని ప్రధానమంత్రి జగద్దేవ ప్రతిహారను “పృథ్వీరాజు కమలం లాంటి రాణులకు చంద్రుని వంటివాడు” అని పేర్కొంది (పగటిపూట వికసించే కమలం చంద్రోదయం వల్ల తన రేకులను ముడుచుకుంటుందనే నమ్మకానికి ఇది ఒక సూచన). ఆ సమయంలో భీముడు మైనరు కావడంతో చాళుక్యుల తరపున జగద్దేవే ఈ సైనిక చర్యకు నాయకత్వం వహించినట్లు తెలుస్తోంది. చారిత్రాత్మకంగా విశ్వసనీయత లేని 'పృథ్వీరాజు రాసో' చాహమాన-చౌళుక్య సంఘర్షణ గురించి కొన్ని వివరాలను అందిస్తుంది. దాని ప్రకారం, పృథ్వీరాజు, భీమ ఇద్దరూ అబూకు చెందిన పరమార యువరాణి ఇచ్ఛినిని వివాహం చేసుకోవాలనుకున్నారు. పృథ్వీరాజు ఆమెను వివాహం చేసుకోవడం ఈ ఇద్దరు రాజుల మధ్య వైషమ్యానికి దారితీసింది. చరిత్రకారుడు జి. హెచ్. ఓఝా ఈ కథను కల్పితమని కొట్టిపారేశారు. ఎందుకంటే ఇది ఇచ్ఛిని సలఖ కుమార్తె అని పేర్కొంటుంది. అయితే ఆ సమయంలో అబూకు పరమార పాలకుడు ధారవర్షుడు. మరోవైపు, చరిత్రకారుడు ఆర్. బి. సింగు, సలఖ అబూలోని మరొక పరమార శాఖకు అధిపతి అని నమ్ముతారు. 'రాసో' ప్రకారం, పృథ్వీరాజు మామ కన్హదేవుడు భీమ మామ సారంగదేవుని ఏడుగురు కుమారులను చంపాడు. ఈ హత్యలకు ప్రతీకారం తీర్చుకోవడానికి, భీమ చాహమాన రాజ్యం మీద దండెత్తి పృథ్వీరాజు తండ్రి సోమేశ్వరుడిని చంపి, ఈ క్రమంలో నాగౌరును ఆక్రమించుకున్నాడు. పృథ్వీరాజు నాగౌరును తిరిగి స్వాధీనం చేసుకుని భీముడిని ఓడించి చంపాడు. ఇది చారిత్రాత్మకంగా అవాస్తవమని తెలిసింది. ఎందుకంటే పృథ్వీరాజు మరణం తర్వాత కూడా 2వ భీమ పాలన దాదాపు అర శతాబ్దం పాటు కొనసాగింది. అదేవిధంగా చారిత్రక ఆధారాల ప్రకారం సోమేశ్వరుడి మరణం సమయంలో 2వ భీమ బాలుడు కాబట్టి ఆయన సోమేశ్వరుడిని చంపి ఉండలేదు.

ఈ వ్యత్యాసాలు ఉన్నప్పటికీ నాగౌరులో చాహమానులు, చౌళుక్యుల మధ్య యుద్ధం జరిగినట్లు కొన్ని ఆధారాలు ఉన్నాయి. బికనీరు సమీపంలోని చార్లూ గ్రామంలో లభించిన రెండు శాసనాలు క్రీ.శ. 1184 (1241 విక్రమ సంవత్సరం)లో నాగౌరు యుద్ధంలో మోహిలు సైనికుల మరణాన్ని స్మరిస్తున్నాయి. మోహిలులు చౌహానుల (చహమానుల), ఒక శాఖ, ఈ శాసనాలు 'పృథ్వీరాజు రాసో'లో వర్ణించబడిన యుద్ధాన్ని సూచిస్తున్నాయని



భావించడానికి అవకాశం ఉంది.

సా.శ. 1187కి కొంతకాలం ముందు జగద్దేవ ప్రతిహార పృథ్వీరాజుతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఖరతర-గచ్ఛ-పట్టావళి ప్రకారం అభయద అనే ఒక సేనాని సపాదాలక్ష దేశం (చాహమాన భూభాగం) నుండి వచ్చిన ధనిక యాత్రికుల మీద దాడి చేసి దోచుకోవడానికి జగద్దేవ అనుమతి కోరాడు. దానికి ప్రతిస్పందనగా జగద్దేవ అభయదతో తాను చాలా కష్టపడి పృథ్వీరాజుతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నానని చెప్పాడు. సపాదాలక్ష ప్రజలను వేధిస్తే అభయదను గాడిద కడుపులో కుట్టిస్తానని జగద్దేవ బెదిరించాడు. చరిత్రకారుడు దశరథ శర్మ సిద్ధాంతం ప్రకారం చాహమాన-చౌళుక్య సంఘర్షణ పృథ్వీరాజుకు కొంత ప్రయోజనంతో ముగిసింది. ఎందుకంటే జగద్దేవ ఆ ఒప్పందాన్ని కాపాడుకోవడానికి చాలా ఆత్రుతగా ఉన్నట్లు కనిపిస్తుంది. చరిత్రకారులు ఆర్.సి. మజుందారు. సతీష చంద్ర ప్రకారం గుజరాతు మీద ఆయన సుదీర్ఘ పోరాటం

# అమరవీరులు

విఫలమైంది. భీముడి చేతిలో ఆయనకు పరాజయం ఎదురైంది. అందువలన పృథ్వీరాజు సా.శ. 1187 నాటికి ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. పృథ్వీరాజు తన రాజ్య సరిహద్దులను విస్తరించినట్లుగా గానీ గత రెండు శతాబ్దాలలో చాలా మంది భారతీయ రాజులను విశిష్టంగా నిలిపినటువంటి చెప్పుకోదగిన సైనిక విజయాలను సాధించినట్లుగా గానీ కనిపించడం లేదు. ఆయన అత్యంత శక్తివంతమైన భారతీయ రాజు అని గానీ, లేదా తన కాలంలోని గొప్ప సేనాధిపతి అని గానీ భావించడానికి ఎటువంటి ఆధారం లేదు. దాదాపు సమకాలీన ముస్లిం చరిత్రకారులు కూడా అలాంటి అభిప్రాయాన్ని కలిగించలేదు. నిజానికి చాంద బర్దాయి రొమాంటిక్ కథే ఆయన చుట్టూ ఒక మాయాజాలాన్ని అల్లింది.

మౌంట్ అబూ చుట్టుపక్కల ప్రాంతాన్ని చౌళుక్య సామంతుడైన చంద్రావతి పరమార పాలకుడు ధారవర్షుడు పరిపాలించాడు. ఆయన తమ్ముడు ప్రహ్లాదన రాసిన 'పార్థ-పరాక్రమ-వ్యాయోగ' అనే గ్రంథం అబూ మీద పృథ్వీరాజు చేసిన రాత్రిపూట దాడిని వివరిస్తుంది. ఈ గ్రంథం ప్రకారం ఈ దాడి చాహమానులు వైఫల్యం చెందారు. ఇది బహుశా పృథ్వీరాజు గుజరాతు దండయాత్ర సమయంలో జరిగి ఉండవచ్చు.

కనౌజు కేంద్రంగా ఉన్న మరో శక్తివంతమైన రాజు జయచంద్రుడిచే పరిపాలించబడిన గహదవాల రాజ్యం, చాహమాన రాజ్యానికి తూర్పున ఉంది. 'పృథ్వీరాజు రాసో'లో ప్రస్తావించబడిన ఒక పురాణం ప్రకారం పృథ్వీరాజు జయచంద్రుడి కుమార్తె సంయోగితను అపహరించుకుపోయాడు. ఇది ఇద్దరు రాజుల మధ్య వైరానికి దారితీసింది.

ఆ పురాణం ఇలా ఉంది: కనౌజు రాజు జైచందు (జయచంద్రుడు) తన ఆధిపత్యాన్ని ప్రకటించుకోవడానికి రాజసూయ యాగాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. పృథ్వీరాజు ఈ వేడుకలో పాల్గొని తద్వారా జైచందును సర్వోన్నత రాజుగా అంగీకరించడానికి నిరాకరించాడు. జైచందు కుమార్తె సంయోగిత, పృథ్వీరాజు వీరోచిత కార్యాల గురించి విని ఆయనతో ప్రేమలో పడింది. తాను ఆయననే వివాహం చేసుకుంటానని ప్రకటించింది. జైచందు తన కుమార్తె కోసం స్వయంవరం ఏర్పాటు చేశాడు. కానీ పృథ్వీరాజును ఆహ్వానించలేదు. అయినప్పటికీ పృథ్వీరాజు వంద మంది యోధులతో కనౌజుకు వెళ్లి సంయోగితను తీసుకుని పారిపోయాడు. గహదవాల సైన్యంతో జరిగిన పోరాటంలో ఆయన యోధులలో మూడింట రెండు వంతుల మంది తమ ప్రాణాలను అర్పించారు. దీనివలన ఆయన సంయోగితతో కలిసి ఢిల్లీకి తప్పించుకోగలిగాడు. ఢిల్లీలో పృథ్వీరాజు తన కొత్త భార్య మీద మోజు పడి తన సమయాన్ని ఎక్కువగా ఆమెతోనే గడపడం ప్రారంభించాడు. ఆయన రాజ్య వ్యవహారాలను నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టాడు, ఇది చివరికి ఘోరీ మహమ్మదు చేతిలో ఆయన ఓటమికి దారితీసింది.

ఈ పురాణగాథ అబులు-ఫజలు ఐన్-ఇ-అక్బరీ, చంద్రశేఖర సుర్జన-చరితలో కూడా ప్రస్తావించబడింది (ఇందులో గహడవాల యువరాణి పేరు "కాంతిమతి" అని ఉంది). పృథ్వీరాజ విజయ ప్రకారం పృథ్వీరాజు ఒక అప్సరస అయిన తిలోత్తమ అవతారంతో ప్రేమలో పడ్డాడు. అయితే ఆయన ఆ స్త్రీని ఎప్పుడూ చూడలేదు. అప్పటికే ఇతర స్త్రీలను వివాహం చేసుకున్నాడు. చరిత్రకారుడు దశరథ శర్మ ప్రకారం ఇది బహుశా సంయోగిత గురించిన ప్రస్తావన కావచ్చు. అయితే ఈ పురాణగాథ పృథ్వీరాజ-ప్రబంధ, ప్రబంధ-చింతామణి, ప్రబంధ-కోశ, హమ్మీర-మహాకావ్యం వంటి ఇతర చారిత్రక ఆధారాలలో ప్రస్తావించబడలేదు. జయచంద్రుడు నిర్వహించినట్లు చెప్పబడే రాజసూయ యజ్ఞంతో సహా, ఈ సంఘటన గురించి గహడవాల రికార్డులు కూడా మౌనంగా ఉన్నాయి.

దశరథ శర్మ, ఆర్. బి. సింగుల అభిప్రాయం ప్రకారం ఈ పురాణగాథలో కొంత చారిత్రక సత్యం ఉండవచ్చు. ఎందుకంటే ఇది మూడు వేర్వేరు ఆధారాలలో ప్రస్తావించబడింది. ఈ మూడు ఆధారాలు కూడా ఈ సంఘటనను సా.శ. 1192లో మహమ్మదు ఘోరీతో పృథ్వీరాజు చివరి యుద్ధానికి కొంతకాలం ముందు జరిగినట్లు పేర్కొన్నాయి.

(ఇంకా ఉంది )



# తరగతి గదే ఒక ప్రయోగశాల

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు . వాటిని అక్షరబద్ధం చెయ్యండి . ఒకటి రెండు బొమ్మలు( ఫోటో తీసి ) కలిపి మాకు పమపండి .ఉత్తమమైన ప్రయోగాన్ని ప్రచురించటమే కాక బహుమతి కూడా గెలుచుకొండి .

మీ పేరు :

పాఠశాల చిరునామా :

ప్రయోగం పేరు :

ప్రయోగం వివరణ :



ప్రయోగం బొమ్మలు :

చివరగా ప్రయోగం మీ సొంతమని హామీ పత్రం తప్పనిసరి . ఎదో ఒక బొమ్మలో మీరు ఉండేటట్లు చుడండి .

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు .మీరు కనుక మీ పాఠశాలలో సైన్సు ఎక్సిబిషన్ నిర్వహించే ఉద్దేశ్యం ఉంటె మాకు తెలియ చెయ్యండి . మీకు ప్రోత్సాహం ఇవ్వటమే కాకుండా , మీ ప్రదర్శనకు సంబంధించిన వార్తలను ఫోటోలతో  ఉచితంగా పత్రికలో ప్రచురిస్తాము .

మీ విద్యార్ధులకు  ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహనా లేదా ?అటువంటి కార్యక్రమం నిర్వహించాలని అనుకుంటున్నారా ? అయితే మాకు రాయండి , కృత్రిమ మేధ, రాకెట్ ప్రయోగాలు , బయోటెక్నాలజీ ..ఇలా వివధ రంగాలలో నిష్ణాతులైన వారిచే ఉచితంగా అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తాము .పూర్తిగా ఉచితం ..ఎటువంటి  రుసుము అవసరం లేదు .

## ప్రయోగశాల



# మీరు వాడే పసుపు అసలైనదేనా, కల్తీదా?

మనం ఇంట్లో పసుపుని అనేక రకాలుగా వాడతాం. వంటల్లో, కొన్ని ఇంటి చిట్కాలు, అందాన్ని పెంచడానికి ఇలా ఎన్నో రకాలుగా వాడతాం. ప్రతీ ఇంట్లోనూ పసుపు ఉంటుంది. దీనిని ఆరోగ్యానికి మాత్రమే పవిత్రమైన పూజల్లోనే వాడుతుంటారు. అందుకే మనం ఎక్కువగా పసుపుని కొంటుంటాం. ఇదే అదునుగా భావించి కొంతమంది దీనిని కల్తీ చేస్తున్నారు. అలాంటి కల్తీ పసుపుని ఎలా కనిపెట్టాలో తెలుసుకోండి.

వంటల్లో వాడడం దగ్గర్నుంచీ ఇంటి గుమ్మాలకి పూయడం వరకూ ఇలా ఎన్నో రకాలుగా పసుపు మన ఇంట్లో ముఖ్యమైన పదార్థం. పసుపులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇవన్నీ మన ఆరోగ్యంతో పాటు అందానికి కూడా ఎంతగానో మేలు చేస్తాయి. వంటకాలకి రంగుతో పాటు మన శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలని కూడా అందిస్తుంది. ఇందులో కర్కుమిన్, ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్ సి, బి6, కెలు ఉంటాయి. ఇవి మనకి వచ్చే అనేక సమస్యల్ని దూరం చేస్తాయి. కాబట్టే, దీనిని వంటల్లోనూ పై పూతగానూ వాడుతుంటాం. పెళ్ళిళ్ళు, పూజలు, వ్రతాల్లోనూ పసుపుని ఎక్కువగా రాస్తుంటారు. ఇంతగా మనం పసుపుని వాడుతుంటాం. కాబట్టి, కల్తీ రాయుళ్ళు దీనిని కల్తీ చేస్తున్నారు. అలాంటప్పుడు మనం అసలైన పసుపుని గుర్తించి దానినే కొనడం చాలా ముఖ్యం.. అసలు మరి అసలైన పసుపుని ఎలా గుర్తించాలో తెలుసుకోండి. అది కూడా ఇంట్లోనే ఎలా గుర్తించాలో తెలుసుకోండి.

సాధారణంగా పసుపుని కల్తీ చేసేందుకు పసుపులో బియ్యంపిండి, జొన్నపిండి వంటివి కలుపుతుంటారు. అందుకే, వీటిని గుర్తించడం కష్టమే. కానీ, అలాంటి పసుపుని కొద్దిగా చేతిపై రాయండి. తర్వాత దానిని క్లీన్ చేయండి. చేతిపై పసుపు రంగు అలానే ఉంటే అది అసలైన పసుపు రంగు త్వరగా పోతే అందులో కల్తీ జరిగిందని గుర్తుంచుకోవాలి. నిజానికి అసలైన పసుపు రంగు మరుసటి రోజువరకూ కూడా ఉంటుంది.

అదే విధంగా, మనం చర్మంపై పసుపుని రాసినప్పుడు అది పూర్తిగా శరీరంలో కలిసిపోతే అది స్వచ్ఛమైన పసుపు అలా కాకుండా పొడిలా మిగిలా ఉంటే కొన్ని పార్టికల్స్‌గా ఉన్నా కూడా అందులో కల్తీ జరిగినట్లుగానే గుర్తించాలి. దీనిని తిన్నా, చర్మానికి రాసినా చాలా సమస్యలొస్తాయి. కాబట్టి, ఇలాంటి పసుపుని వాడకుండా ఉండడమే మంచిది.

అదే పసుపుని మనం చేతి వేళ్ళతో రుద్దినప్పుడు అది మెత్తగా ఉంటే అందులో ఎలాంటి కల్తీ జరగనట్లే. అలా కాకుండా ఏ మాత్రం మనకి కొద్దిగా రఫ్‌గా అనిపించినా కూడా అందులో కల్తీ జరిగినట్లుగానే గుర్తించాలి. కాబట్టి, ఈ విషయాన్ని

గుర్తించాలి.

ఓ గాజు గ్లాసులో నీరు తీసుకుని అందులో పసుపుని కలపండి. పసుపు పూర్తిగా కలిసిపోయి రంగు పచ్చగా మారితే అది అసలైన పసుపు. అలా కాకుండా చివర్లో ఏ మాత్రం పిండిలా, రాళ్ళలా ఉన్నా అందులో కల్తీ జరిగినట్లే. కాబట్టి, దీనిని గుర్తించాలి. ఇలా కల్తీ పసుపు అడుగున కిందకి చేరుతుంది.

మనం కల్తీ పసుపుని నోటి ద్వారా తీసుకుంటే అజీర్ణం, కడుపునొప్పి, గ్యాస్, వాంతుల వంటి సమస్యలొస్తాయి. అంతేకాకుండా, అలర్జీ కూడా ఉంటుంది. దీని వల్ల కిడ్నీలు, లివర్ కూడా పాడవుతుంది. ఇక స్కిన్‌కి రాస్తే రాషెస్, మొటిమలు, మచ్చల వంటివి వస్తాయి. కాబట్టి, ముందుగానే నకిలీ పసుపుని గుర్తించడం చాలా ముఖ్యం.



# బొమ్మకు కథ

**ఈ క్రింది బొమ్మకు కథ రాసి పంపండి ఉత్తమమైన కథకు రూ 116 /-బహుమతి పొందండి నిబంధనలు :పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే ,కథ కనీసం ప్రింటులో ఒక పేజి రావాలి కథ యుని కోడ్ లో టైపు చేసి పంపాలి ,చేతి రాత కథలు స్వీకరించబడవు పంపవలసిన చిరునామా sumathibalapatrika@gmail.com ఆఖరు తేది :15-07-2026**



## బొమ్మలు వేసి పంపండి

### అంశం : బస్టాండ్

**నిబంధనలు :పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే ,A4 సైజు పపెర్ మీద గీసి ఫోటో తీసి పంపండి**

**తల్లి తండ్రులు , ఉపాధ్యాయులు పిల్లలను పోటిలకు ప్రోత్సహించండి .పోటిలో గెలిచిన వారి ఫోటతో పాటు వారి తల్లి తండ్రుల , ఉపాద్యాయుల వివరాలు కుడా ప్రచురిస్తాము**

**పంపవలసిన చిరునామా**

**sumathibalapatrika@gmail.com**

**ఆఖరు తేది :15-09-2026**


## పజిల్:

16 గళ్ళచతురస్త్రాకారం లో 4 రాణులను ఉంచండి .ఏ రాణి ఇంకో రాణి తో నిలువుగా అడ్డంగా కర్ణం గా ఎదురు ఎదురుగా రాకూడదు


వివరంగా మీ సమాధానం రాయండి .ఉత్తమ సమాధానానికి 116/- బహుమతి పొందండి .


**ఆఖరు తేది :15-09-2026**

# బొమ్మల కథ


ఆలీబాబా
40
దొంగలు
చిన్నదే ఇవ్వు అక్కా
నీకు చిన్నది
కావాలా
పెద్దది కావాలా
ఏమి కొలుస్తారో , దీనికింద
చింతపండు పెడతాను అప్పుడు
ఏమి కొలిచారో తెలుస్తుంది

# బొమ్మల కథ


ఇదిగో త్రాసు
త్వరగా తెచ్చి ఇస్తాను
ఫరవాలేదు నిదాననగా ఇవ్వు


అలీ బాబా ఆ త్రాసుతో బంగారు నాణాలు కొలిచి , వాటిని తన ఇంటి వేనాకల్ గొయ్యి తీసి దాచాడు

# బొమ్మల కథ


కొలిచిన తరువాత త్రాసును తిరిగి ఇచ్చివేసింది
ఆలీబాబా భార్య
త్రాసు దుగున బంగారు
నాణం చిన్నపందుకు
అతుక్కుంది
బంగారు నాన్నలు
కొలిచారు వీళ్ళకు ఇవి
ఎక్కడినుంచి వచ్చాయి
18

(ఇంకా ఉంది )


# తప్పులను కనిపెట్టండి



# కనుక్కోండిచూద్దాం

## దారి కనిపెట్టండి

## BUTTERFLY MAZE



# రంగులు వేయండి

| | | | |
|---|---|---|---|
| 1 red | 2 yellow | 3 green | 4 blue |
| 5 orange | 6 pink | 7 purple | |

